
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 286 | హైదరాబాద్ | శనివారం 09-05-2026 | పేజీలు : 12 | వెల : 1.00

11లో


పుతిన్ హత్యకు కుట్ర.. ఎక్కువ కాలం బంకర్లోనే గడుపుతున్న రష్యా అధినేత

## కొడంగల్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి: రేవంత్ రెడ్డి

- కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన సీఎం
- అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కన పెట్టాలన్న సీఎం
- కొడంగల్‌ను రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్ రెడ్డి

11లో






## తెలంగాణ ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు కొత్త రూల్స్!

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక సంస్కరణ
- పదో తరగతి మెమో, ఆధార్‌లో పేరు కచ్చితంగా సరిపోలాలని నిబంధన
- ఎస్సీలతో పాటు ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి ఫీజులు
- ఆధార్‌లో తప్పులుంటే సరిచేసుకోవాలని విద్యార్థులకు అధికారుల సూచన

11లో



## వేగంగా వ్యాపిస్తున్న హంటా వైరస్ అప్రమత్తంగా ఉండాలన్న డబ్ల్యూహెచ్ఓ

- ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్
- దీని వ్యాప్తి కరోనా వైరస్ కు పూర్తిగా భిన్నమన్న డాక్టర్ మరియా కెర్ఖోవ్
- సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తుల మధ్యే వ్యాపిస్తుందని వెల్లడి

11లో

## గవర్నర్‌తో భేటీ.. రేపే సీఎంగా విజయ్ పట్టాభిషేకం

- తమిళనాడు ప్రభుత్వ ఏర్పాటుపై వీడిన ఉత్కంఠ
- గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ క్లెయిమ్
- రేపు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న విజయ్
- 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు వెల్లడి
- మద్దతిచ్చిన వామపక్ష పార్టీలకు కృతజ్ఞతలు తెలిపిన విజయ్

11లో







## యూఎస్‌ఇరాన్ వార్ చమురు కంపెనీలకు భారీ దెబ్బ!

- యుద్ధానికి ముందు 70 డాలర్లుగా ఒక బ్యారెల్ ముడి చమురు ధర
- ఇప్పుడు 100 డాలర్లు పలుకుతున్న వైనం
- అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో మాత్రం స్థిరంగా ధరలు

11లో



## మోదీ పర్యటన ఆ ప్రాంతాల్లో డ్రోన్లపై నిషేధం!

- ఆదివారం హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆంక్షలు
- రేపు అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు
- డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం

11లో

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం ముగ్గురి మృతి

- దుకోనో అగ్నిపర్వతం ఉగ్రరూపం
- 10 కిలోమీటర్ల ఎత్తుకు ఎగిసిన బూడిద
- చిక్కుకుపోయిన 20 మంది పర్వతారోహకుల తరలింపు
- 4 కిలోమీటర్ల పరిధిలో కార్యకలాపాలు నిషేధం

11లో






## బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు ప్రమాణం

- పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోల్‌కతాలో అధికారికంగా ప్రకటించారు
- భవానీపూర్‌లో మమతా బెనర్జీపై గెలిచిన సువేందుకే సీఎం పీఠం
- రేపు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారం
- ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు సమాచారం

11లో

భారత శక్తి

## విజయ్ కంటే.. రాజేంద్ర అర్లేకరే ఫేమస్

దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా తమిళనాడు రాజకీయాలు సృష్టిస్తున్న సంచలనం మామూలుగా లేదు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు ఏ పార్టీకి కూడా వన్ సైడ్ విక్టరీ ఇవ్వలేదు. ప్రభుత్వ వ్యతిరేకతను.. ప్రతిపక్షం పార్టీ మీద ఉన్న ఆగ్రహాన్ని ఏకకాలంలో ప్రదర్శించారు. అభిమానాన్ని కూడా చూపించారు. ఫలితంగా మూడు పార్టీలలో దేనికి కూడా గొప్పగా చెప్పుకునే మెజారిటీ రాలేదు. దీంతో ఈసారి తమిళనాడులో బంపర్ మెజారిటీ ఏ పార్టీ సాధించలేకపోయింది. కనీసం మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా కూడా రాలేకపోయింది. దీంతో పొత్తులు.. సంకీర్ణాల గురించి చర్చ నడుస్తూనే ఉంది. అయితే ఇంతవరకు తమిళనాడులో ఏర్పడిన సందిగ్ధం తీరలేదు.విజయ్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వచ్చినప్పటికీ.. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేదు. ఇతర పార్టీల నేతలను కూడగట్టే ప్రయత్నం చేసినప్పటికీ అది సాధ్యం కావడం లేదు. దీంతో తమిళనాడులో రకరకాల రాజకీయాలు సాగుతూ ఉన్నాయి. ఇప్పటికే డీఎంకే తమిళనాడు రాజకీయాల మీద క్లారిటీ ఇచ్చేసింది. తాము ఎవరికి సపోర్ట్ చేయమని.. ప్రజల ఓటింగ్ ద్వారా లభించిన ప్రతిపక్ష స్థానాన్ని కొనసాగిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు మరో మలుపు తీసుకున్నాయి. ఇప్పటికే రిసార్ట్ నుంచి ఎమ్మెల్యే విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం గవర్నర్ ను కలిశారు. కాకపోతే గవర్నర్ అడిగిన ప్రశ్నలకు టీవీకే అధినేత వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. దీంతో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకారం రద్దయింది. అంతేకాదు ఇప్పట్లో తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు.తమిళనాడు రాజకీయాల్లో ఈ సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఒక వ్యక్తి విజయ్ కంటే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. మీడియా కూడా ఆయన గురించి విశేషంగా కథనాలను ప్రసారం చేస్తోంది. ఆ వ్యక్తి రాజకీయాలతో సంబంధం ఉన్నవారు కాదు. పార్టీలతోనూ సంబంధం ఉన్నవారు కాదు. ఆయన మరెవరో కాదు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. ఇటీవల విజయ్ గవర్నర్ కార్యాలయం వద్దకు వెళ్ళినప్పుడు రాజేంద్ర సాదరంగా స్వాగతం పలికారు. మెజారిటీ చూపిస్తేనే టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని అన్నారు. దీంతో రాజేంద్ర మీద తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. కొన్ని పార్టీలు రాజేంద్ర తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని మండిపడుతున్నాయి. కమలహాసన్ నుంచి మొదలు పెడితే విశాల్ వరకు అందరు గవర్నర్ తీర్పట్ల మండిపడుతున్నారు.తమిళనాడు రాజకీయాలలో సస్పెన్స్ వీడటం లేదు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ టీవీకే పార్టీకి.. ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ అనుమతి ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయ పరిణామాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తాజా రాజకీయ పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే విజయ్‌ను గవర్నర్ అనుమతించకపోవటం అన్యాయమైన చర్యగా జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.గవర్నర్ తీరు అప్రజాస్వామికమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వానికి శాసనసభ మద్దతు ఉందా, లేదా అనే విషయం తేల్చాల్సింది అసెంబ్లీలో కానీ.. రాజ్‌భవన్‌లో (లోక్ భవన్) కాదని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించేలా గవర్నర్‌కు సూచించాలని అన్నారు. బలనిరూపణ ద్వారా శాసనసభలో ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ.. మైనారిటీ ప్రభుత్వమైనా పాలన సాగించవచ్చని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్న జేపీ.. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏర్పాటు, 1991 నుంచి 1996 వరకూ పీవీ నరసింహారావు పాలనను గుర్తు చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత రాజకీయాలు చేసే హక్కు గవర్నర్లకు లేదని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతమున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరిస్తూ తమిళ ప్రజలు అసాధారణమైన తీర్పును ఇచ్చారని.. గవర్నర్ ఆ తీర్పును అగౌరవపరచడం రాజకీయాలపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు.. వీధి పోరాటాలకు, ప్రభుత్వాల పతనానికి ఎలా దారితీస్తాయో పొరుగు దేశాలలో చూశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వివేకం, ముందుచూపుతో వ్యవహరించి, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీగా నిలిచినవారిని ఆహ్వానించమని గవర్నర్‌కు సలహా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని.. గవర్నర్ ఇంకా మొండిగా వ్యవహరిస్తే, అతడిని తక్షణమే తొలగించాలని సూచించారు.రాజేంద్ర 1989లో బిజెపిలో చేరారు. 2002, 2012లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్ గా దేశంలోనే మొట్టమొదటిసారిగా కాగిత రహిత అసెంబ్లీ ని రూపొందించారు. రాజ్యాంగ సూత్రాలను ఈయన నూటికి నూరుపాళ్ళు అమలు చేస్తారు. 2025 నుంచి కేరళ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి ఇన్చార్జి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు.

# పార్ట్ టైం పాలిటిక్స్ లో జగన్

విజయవాడ, మే 8,

రాజకీయాలు ఒక వృత్తి. ఒక పద్ధతి ప్రకారం చేస్తేనే దానికి ఒక గుర్తింపు ఉంటుంది. అధికారానికి చేరువ కాగలం. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో పొలిటికల్ ట్రెండ్స్ చూస్తుంటే ఎప్పటికప్పుడు మార్పులు కనిపిస్తున్నాయి. అయితే దానిని అందుకుంటేనే అనుకున్నది సాధించగలం. విజయ్ రెండు సంవత్సరాల క్రితం పార్టీని ఏర్పాటు చేశారు. అంతకంటే ముందే మరో సీనియర్ నటుడు కమల్ హాసన్ సైతం పార్టీని ఏర్పాటు చేశారు. అయితే విజయ్ అంత దూకుడుగా వ్యవహరించలేదు. సినిమాలను పక్కనపెట్టి రాజకీయాలపైనే పూర్తిగా దృష్టిపెట్టారు విజయ్. జీవన్మరణ సమస్య అన్నట్టు పోరాటం చేశారు. అనుకున్నది సాధించగలిగారు. పశ్చిమ బెంగాల్లో బిజెపి నేతలు చేసింది కూడా అదే. ఫుల్ టైం రాజకీయాలు చేసి అక్కడ సక్సెస్ అయ్యారు. అయితే ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి అందుకు విరుద్ధంగా ఉన్నారు. ఒకసారి అధికారం చేపట్టి దానికి దూరం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అయినా సరే ఫుల్ టైం పాలిటిక్స్ చేయడం లేదు. వీకెండ్ పాలిటిక్స్ కు పరిమితం అవుతున్నారు.2019 నుంచి 2024 మధ్య టిడిపి తో పాటు జనసేన విపక్షంలో ఉంది. ఆ సమయంలో చంద్రబాబు రాజకీయాలంటే ఒక ఊపిరిగా పనిచేశారు. లోకేష్ సైతం రాజకీయాలను ఒక వృత్తిగా భావించారు. పవన్ కళ్యాణ్ సైతం రోజువారి జరిగే పరిణామాలపై కూడా స్పందించేవారు. ఆ ముగ్గురితో పోల్చుకుంటే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు దేనిపై స్పందిస్తున్నారు. అలాంటి రాజకీయాలు చేస్తున్నారా? కనీసం ఏ అంశం పైన స్పందిస్తున్నారా? అంటే సమాధానం దొరకని పరిస్థితి. ఎంతవరకు తన పార్టీపై పగ తీర్చుకుంటున్నారు. ప్రతీకార కేసులు పెడుతున్నారు అని ఆరోపణలు చేస్తున్నారే తప్ప.. సమకాలిన అంశాలపై ఆయన స్పందించడం లేదు. జనాల్లోకి వచ్చి తిరగడం లేదు. జనాల సమస్యలను మరింత గట్టిగా అడగడం లేదు. బెంగళూరులో నాలుగు రోజులు.. తాడేపల్లిలో రెండున్నర రోజులు గడిపేసి వెళుతున్నారు. కళ్ళు మూసుకుంటే రెండేళ్లు దాటిపోయాయి. మరో మూడేళ్లు దాటి పోతే మన ప్రభుత్వం వచ్చేస్తుంది అని చెబుతున్నారు. ఫుల్ టైం రాజకీయాలు చేయకుండా పార్ట్ టైం రాజకీయాలకు పరిమితం అవుతున్నారు.ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ఓడిపోయాయి. ఇదో ట్రెండ్ నడుస్తోంది. అయితే అధికార పార్టీలు ఏదో ఈజీగా ఓడిపోలేదు. అక్కడ విపక్షాలు గట్టి ప్రయత్నాలు చేశాయి. దానిపై సత్ఫలితాలు వచ్చాయి. ఈ ట్రెండ్ను ఇలానే కొనసాగించాలి అంటే ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి ఉన్నారు అని



భావన కలిగించాలి. కానీ ఎందుకు ఆయన జనం మధ్యకు వచ్చేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. అన్నింటికీ 2027 పాదయాత్రను చూపిస్తున్నారు. అయితే 2017 పాదయాత్ర ఒక ఎత్తు.. ఇప్పుడు ఒక ఎత్తు. ఎందుకంటే అప్పుడు అధికారంలో అంతకు ముందు లేరు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పాలించారు. అందుకే పాదయాత్ర పై కూడా అంతగా నమ్మకం పెట్టుకోకూడదు. అంతకుమించి పార్ట్ టైం రాజకీయాలు చేయకూడదు. ఇక జగన్మోహన్ రెడ్డి ఇష్టం.

=============

# ముగ్గురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీ

తిరుమల, మే 8,

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగినట్లుగా భావిస్తున్న అవకతవకలపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంపై గతంలో మాజీ సీఎస్ దినేష్ కుమార్ సమర్పించిన ఏకసభ్య కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించేందుకు తాజాగా ఒక ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఈ వివాదంపై ఇప్పటికే విచారణ జరిపిన వన్ మెన్ కమిటీ సమర్పించిన నివేదికను లోతుగా విశ్లేషించేందుకు, తదుపరి చర్యల కోసం ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హై లెవెల్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను వెలికితీసి, దోషులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.ప్రభుత్వం తాజాగా ఏర్పాటు చేసిన ఈ హై లెవెల్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి ఉంటారు. లడ్డూ తయారీలో వాడిన నెయ్యి నాణ్యత, టెండర్ల ప్రక్రియలో జరిగిన ఉల్లంఘనలపై ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ దినేష్ కుమార్ ఇచ్చిన నివేదికలోని ముఖ్యాంశాలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.ఈ కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం, విచారణను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం వారంలోకా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి కార్యాలయం సూచించింది. వన్ మెన్ కమిటీ నివేదిక ఆధారంగా ఎవరెవరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి? ఏయే విభాగాల్లో లోపాలు జరిగాయి? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి నిబంధనలు తీసుకురావాలి? అనే అంశాలపై ఈ ఉన్నత స్థాయి కమిటీ తన సిఫార్సులు చేయనుంది.భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో, ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఉన్నత స్థాయి కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ , మరియు న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా వ్యవహరించనున్నారు. దినేష్ కుమార్ కమిటీ సేకరించిన ఆధారాలు, నెయ్యి సేకరణలో జరిగిన నిబంధనల ఉల్లంఘనలు, మరియు లడ్డూ నాణ్యత విషయంలో గతంలో జరిగిన పొరపాట్లపై ఈ కమిటీ లోతైన అధ్యయనం చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలు, టెండర్ల ప్రక్రియలో జరిగిన లోపాలను ఈ కమిటీ నిశితంగా పరిశీలిస్తుందిదినేష్ కుమార్ నివేదికలోని సిఫార్సులను ఏ మేరకు అమలు చేయవచ్చు..? బాధ్యులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..? అనే అంశాలపై ఈ త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించనుంది. ఈ ప్రక్రియ ద్వారా తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడే ముడిపదార్థాల నాణ్యతను కాపాడటానికి శాశ్వత పరిష్కారాలను కూడా ఈ కమిటీ సూచించే అవకాశం ఉంది. ఈ హైలెవల్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో, ప్రస్తుతం ఈ కమిటీ నియామకం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# వైసీపీ ప్రచార అస్త్రంగా వర్మ

కాకినాడ, మే 8, (

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సరైన అస్త్రం దొరికింది. పిఠాపురం వర్మపై టిడిపి వేటు వేయడంతో.. ఇక వైసిపి సోషల్ మీడియాకు చేతినిండా పని దొరికింది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూటమిలో విచ్ఛిన్నం తెచ్చేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ ఆ ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. అయితే గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కొంతమంది ఎమ్మెల్యేలు ధిక్కార స్వరం వినిపించారు. ఇప్పుడు అదే పరిస్థితిని తెచ్చి కూటమిలో విభేదాలు తెచ్చేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు సహజంగానే చేస్తుంది. ఇప్పటికే కృష్ణ జిల్లాలో ఒకరు లైన్ దాటి



మాట్లాడుతున్నారు. పిఠాపురంలో సైతం వర్మ అలానే వ్యవహరిస్తున్నారు.. తాను కచ్చితంగా గెలిచే నియోజకవర్గం అనే ఆవేదన ఆయనలో ఉంటుంది. అది సహజం కూడా. అయితే డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగుతుంది కూడా. ఇటువంటి సమయంలో సహకరించాల్సింది పోయి వర్మ స్వతంత్రంగా ముందుకు వెళున్నారు. ఆయన కోణంలో అది తప్పు లేదు కానీ.. కూటమిపరంగా మాత్రం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అందుకే టిడిపి నాయకత్వం వర్మపై వేటు వేసినట్లు తెలుస్తోంది.పిఠాపురం నియోజకవర్గం కావాలా? లేకుంటే మంచి రాజకీయ భవిష్యత్తు కావాలా? అని టిడిపి హై కమాండ్ వర్మను కోరినట్లు తెలుస్తోంది. మూడు రోజుల కిందట వర్మ నారా లోకేష్ ను ప్రత్యేకంగా కలిశారు. ఆ తరువాత ఇప్పుడు వర్మను తొలగిస్తూ పర్యవేక్షణకు గాను ముగ్గురు సభ్యులతో కూడిన టిడిపి కమిటీని ఏర్పాటు చేశారు. కచ్చితంగా వర్మకు చెప్పి.. ఒప్పించి మరి ఆయనను తప్పించి ఉంటారన్న అనుమానాలు అంచనాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు వైసీపీ అనుకూల మీడియా కచ్చితంగా వర్మకు జరిగిన అన్యాయం పై డిబేట్ పెడుతుంది. టిడిపికి వ్యతిరేకంగా ప్రచారం కూడా చేయిస్తుంది.వాస్తవానికి గతంలోనే వర్మ వైసీపీలోకి వెళ్లిపోతారన్న ప్రచారం పతాక స్థాయిలో జరిగింది. కూటమి అధికారంలోకి రాగానే వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అప్పట్లో హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అధికారంలోకి వచ్చి నెలలు సంవత్సరాలు దాటుతున్న ఆయనకు ఎటువంటి పదవి లేకుండా పోయింది. దీంతో ఆయనలో అనహానం పెరిగిపోయిందని.. పదవి రాకుండా పవన్ కళ్యాణ్ అడ్డుకుంటున్నారని.. అందుకే వర్మ వైసీపీలో చేరిపోతారని లేనిపోని ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు ఒకటి మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. ఇదివరకే రాష్ట్ర కార్యవర్గంలోకి వర్మను తీసుకున్నారు.

లోకేష్ ను కూడా వర్మ కలిశారు. ఆ తరువాత ఇంచార్జ్ పోస్టును తీసేసారు. వర్మ పిఠాపురం బాధ్యతలనుంచి తప్పుకుంటే కీలక పదవి కట్టబెట్టే హామీ లభించి ఉంటుంది అనేది పొలిటికల్ వర్గాల్లో ప్రచారం. త్వరలో వర్మను ఎమ్మెల్సీ చేస్తారని కూడా ఒక టాక్ ఉంది. అయితే టిడిపి ఇన్చార్జిగా మరో అధికార కేంద్రంగా పిఠాపురంలో మారకూడదని భావించి.. ఆయన అనుమతితోనే పదవి నుంచి తొలగించి ఉంటారన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. అయితే వర్మకు పదవి తొలగించిన తర్వాత ఆయన స్పందించిన తీరుబట్టి ఒక అంచనాకు రావచ్చు.

వర్మ తొలగింపు

రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పదవి నుంచి వర్మను కలిగిస్తూ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతోనే తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. వర్మను తొలగించి.. టిడిపి పర్యవేక్షణ బాధ్యతలను ముగ్గురు నేతలతో కూడిన కమిటీకి అప్పగించింది. వర్మ వ్యక్తిగత వ్యవహార శైలి కూటమి సమన్వయానికి విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కూటమి విషయంలో ఇప్పటికే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ శ్రేణులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చారు. ఇప్పుడు అదే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో టిడిపి నుంచి కూటమికి ఇబ్బంది రాకుండా ఉండేందుకుగాను.. వర్మ పై వేటు వేసింది టిడిపి నాయకత్వం.మొన్నటి ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గాన్ని పొత్తుల భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే తెలుగుదేశం పార్టీకి ఇది బలమైన నియోజకవర్గం. అందుకే వర్మ నేతృత్వంలోని టిడిపి శ్రేణులు అభ్యంతరం తెలిపాయి. కానీ చంద్రబాబు చొరవ తీసుకొని ఒప్పించడంతో పవన్ గెలుపు కోసం కృషి చేశారు వర్మ. అంతవరకు ఓకే కాని ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత.. వర్మ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. పిఠాపురం నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఆయన గట్టి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో జనసేన నేతలతో ఘర్షణ వైఖరి అనుసరించారు.

మొన్ననే జనసేన మాజీ ఎమ్మెల్యే దొరబాబుతో వీధి పోరాటానికి దిగారు. కేవలం ఉద్దేశపూర్వకంగా ప్రోటోకాల్ పేరుతో వర్మ ఘర్షణ వైఖరి అనుసరిస్తున్నారు అని టిడిపికి నివేదికలు అందాయి.కూటమి విషయంలో ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు ఉంటాయని స్పష్టమైన సంకేతాలు పంపింది టిడిపి నాయకత్వం.

మొన్నటి ప్రోటోకాల్ రగడ తర్వాత వర్మకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. దీంతో వర్మ విషయంలో టిడిపి నాయకత్వం చూసి చూడనట్టుగా వెళుతుందని ఒక అభిప్రాయం ఏర్పడింది. కానీ ఇప్పుడు దానికి చెక్ చెబుతూ వేగంగా ఇంచార్జ్ పదవి నుంచి వర్మను తొలగించారు. కూటమి విషయంలో ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారినైనా విడిచి పెట్టేది లేదని సంకేతాలు పంపింది టిడిపి నాయకత్వం. అయితే వర్మకు చెప్పి తొలగించారా? ఈ ఆదేశాలు వెనుక వర్మ ఎలా స్పందిస్తారు? అనేది తెలియాల్సి ఉంది. కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతుంది. వర్మ కోసం ప్రయత్నాలు చేస్తుంది. గతంలో కూడా వర్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఒక ప్రచారం బలంగా జరిగింది. ఇప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో చూడాలి.

# సైలెంట్ గా కేతిరెడ్డి....

అనంతపురం, మే 8, (న్యూస్ పల్స్)

ఏపీ వైసీపీలో ఆ లీడర్ స్టైలే వేరు. ఎడ్యుకేటెడ్. వాస్తవాలకు దగ్గరగా..ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే మనస్తత్వం ఉన్న ఆయన..గత ఎన్నికల్లో ఓటమి తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత తెరమీదకు వచ్చి ప్రెస్‌మీట్లు, ఫీల్డ్‌లో ఆందోళనలు, కూటమి సర్కార్‌పై అటాక్ చేస్తూ లైమ్‌లైట్‌లో కొనసాగారు. ఇప్పుడేమైందో ఏమో తెలియదు కానీ మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో ఎప్పుడూ ప్రజల్లో ఉండే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడే కేతిరెడ్డి..ఎన్నికల ఫలితాల తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉండిపోయారు. ఈ మధ్యకాలంలో ఫుల్ యాక్టివ్ అయ్యారు. ప్రెస్‌మీట్లు, ఆందోళనలు, క్యాడర్‌తో మీటింగ్‌లు పెట్టి లైమ్‌లైట్‌లో కనిపించారు. ఇప్పుడు మళ్లీ కేతిరెడ్డి ఎక్కడా కనిపించట్లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఆయన మళ్లీ సైలెంట్ కావడానికి వైసీపీలో నాయకుల మధ్య ఉన్న విభేదాలే కారణమా లేక మరేదైనా రీజన్ ఉందా.? అనే చర్చ మొదలైంది.రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్య వైరం నడుస్తోందట. ధర్మవరంలో రాప్తాడు నియోజకవర్గం వైసీపీ పార్టీ ప్రారంభిస్తానని ప్రకాష్ రెడ్డి స్టేట్‌మెంట్ ఇవ్వడంతో ఇద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందట. పార్టీ అధికారంలో ఉన్నప్పటి నుంచే తోపుదుర్తి, కేతిరెడ్డి మధ్య గ్యాప్ కొనసాగుతుందని వైసీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇక ధర్మవరంలో పార్టీ ఆఫీస్‌ను పెడుతానంటూ తోపుదుర్తి ప్రకటించడంతో కేతిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధర్మవరంలో ఆఫీస్ పెట్టడం ఎందుకు..ఫోన్ ఎత్తి సమాధానం చెప్తే సరిపోతుంది కదా అంటూ సెటైర్ వేశారు. ముందుగా రాప్తాడులో పార్టీ ఆఫీస్ పెట్టుకోమనంటూ అంటూ కేతిరెడ్డి గట్టిగానే సమాధానం ఇచ్చారు.అయితే కేతిరెడ్డిపై పైచేయి సాధించే ఉద్దేశంతో ఎలాగైనా ధర్మవరం వైసీపీకి కొత్త నాయకుడిని తేవాలని తోపుదుర్తి ఇంటర్నల్‌గా గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కేతిరెడ్డి ప్రత్యర్థి అయిన అంగబలం, అండ బలం ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యేను వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రకాష్ రెడ్డి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్. అయితే ధర్మవరంలో కేతిరెడ్డిని కాదని వైసీపీ అధిష్టానం మరొకరికి అవకాశం ఇస్తుందా? అంతటి సాహసం చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది.కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి వైసీపీ అధిష్టానంతో మంచి సంబంధాలే ఉన్నాయట. కేతిరెడ్డి దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే తత్వం చూసిన అధిష్టానం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని చూసిందట. కానీ సామాజిక సమీకరణాల నేపథ్యంలో బీసీలకు కేటాయించినట్లు చెబుతున్నారు. ధర్మవరం నియోజక వర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వైసీపీలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన పార్టీ మారతారని గుసగుసలు వినిపించాయి. రాజకీయాలలో గెలుపోటములు సహజం అంతమాత్రాన కన్నతల్లి లాంటి పార్టీని వీడుతామా అంటూ..తాను వైసీపీ అధినేత జగన్ వెంటే ఉంటానని ప్రచారానికి ఫులిస్టాప్ పెట్టారు కేతిరెడ్డి. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుంది అప్పుడు 2.౦లో తామేంటో చూపిస్తామంటూ వైసీపీ క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపే ప్రయత్నం చేశారు. అయితే కేతిరెడ్డి ఎప్పుడు ఫుల్ యాక్టివ్ మోడ్‌లోకి వస్తారోనని ఎదురు చూస్తోంది ధర్మవరం వైసీపీ క్యాడర్. ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీలో ప్రకాశ్ రెడ్డి వర్సెస్ కేతిరెడ్డి మధ్య 2019 నుంచి కోల్డ్ వార్ నడుస్తోందట. అప్పట్లో మంత్రి పదవి విషయంలో ఇద్దరి మధ్య కాస్త డిఫరెన్సెస్ వచ్చాయట. వైసీపీ హయాంలో జిల్లాలో కురుమ సామాజిక వర్గానికి మంత్రి పదవి రావడానికి, రెడ్డి సామాజిక వర్గానికి అమాత్యయోగం దక్కకపోవడానికి కేతిరెడ్డే కారణమని అని తోపుదుర్తి కినుక వహించారట. దీంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య గ్యాప్ నడుస్తోందట. అదీకాక ధర్మవరం వైసీపీ టికెట్‌ను గోరంట్ల మాధవ్‌కు ఇప్పించాలని తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కాస్త గట్టిగానే ట్రై చేశారట. ఈ ఇష్యూతో కేతిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి మధ్య గ్యాప్ మరింత



పెరిగిందట. ఓ వైపు పార్టీ ఓడిపోయి ప్రతిపక్షంలో ఉండగా..నేతల గొడవతో తమను ముందుండి నడిపించే నాయకులు లేరని..క్యాడర్ ఆందోళన చెందుతోందట. ఇప్పటికైనా కేతిరెడ్డి యాక్టివ్ మోడ్‌లోకి వచ్చి..ధర్మవరం పార్టీ యాక్టివిటీని స్పీడప్ చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారట

# కేంద్ర కేబినెట్ లో మార్పులు

విజయవాడ, మే 8

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. భారతీయ జనతా పార్టీకి అనుకూల ఫలితాలు ఇవి. పశ్చిమ బెంగాల్ చేజిక్కడం.. అస్సాంలో రెండోసారి అధికారంలోకి రావడం భారతీయ జనతా పార్టీ దూకుడు అప్రతిహాసంగా కొనసాగుతోంది. మరోవైపు పుదుచ్చేరిలో సైతం తిరిగి ఎన్ డి ఏ గెలుపొందడం ఆ పార్టీకి మరింత ఊపు తెచ్చింది. మరోవైపు కేరళలో మూడు అసెంబ్లీ స్థానాలతో ఉనికి చాటుకుంది. తమిళనాడులో ఆ పార్టీ గెలవకపోయినా అస్తవ్యస్త వాతావరణం తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉంది బిజెపి. అయితే ఇదే ఊపుతో మిగతా రాష్ట్రాలపై దృష్టి పెట్టాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఇప్పటికే 29 రాష్ట్రాలకు గాను.. 20 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంది. అందుకే మిగతా రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెడుతోంది. అందులో భాగంగా కేంద్ర క్యాబినెట్ విస్తరణ చేపట్టి.. అన్ని రాష్ట్రాలకు సమప్రా ధాన్యం ఇవ్వాలని చూస్తోంది. ఏపీ నుంచి ఇద్దరికీ మంత్రి పదవులు ఖాయమన్న టాక్ నడుస్తోంది.ప్రస్తుతం ఏపీ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ముగ్గురు ఉన్నారు. క్యాబినెట్ హోదాలో కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉన్నారు. స్వతంత్ర హోదాలో గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. సహాయ మంత్రిగా బిజెపి ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కొనసాగుతున్నారు. ఎన్డీఏకు 21 మంది ఎంపీలు ఉండగా.. అందులో ముగ్గురికి కేంద్ర మంత్రి పదవులు ఉన్నాయి.. ఇంకా 18 మంది ఎంపీలు ఉన్నారు. అయితే ఇప్పుడు రెండు మంత్రి పదవులు ఇస్తే ఏ పార్టీకి కేటాయిస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే టిడిపి తో పాటు బిజెపికి రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంది. ఇప్పుడు లేనిది ఒక్క జనసేనకు మాత్రమే. ఈసారి కచ్చితంగా కేంద్రమంత్రివర్గంలోకి జనసేన వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. ప్రస్తుతం జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. కాకినాడ నుంచి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, మచిలీపట్నం నుంచి వల్లభనేని బాలసౌరి ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని ప్రచారం సాగుతోంది. బాలశౌరి కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. గతంలో రెండు సార్లు ఎంపీగా కూడా ఎన్నికయ్యారు. ఆయనకు తప్పకుండా కేంద్ర క్యాబినెట్లో చోటు దక్కుతుంది అన్న టాక్ నడుస్తోంది. మరోసారి బిజెపికి ఛాన్స్ ఇస్తే మాత్రం దగ్గుబాటి పురందేశ్వరికి బెర్త్ లభించే అవకాశం ఉంది. సీఎం రమేష్ కూడా ఒక ఆశావహుడిగా ఉన్నారు. టిడిపికి ఇస్తే మాత్రం రాయలసీమ నుంచి.. రెడ్డి సామాజిక వర్గ పరంగా, మహిళా నేతపరంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జనసేన ఒంటరి పోరు...

కాకినాడ, మే 8,

ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారం.. తమిళనాడులో విజయ్‌పార్టీ టీవీకే ఒంటరిగా నిలిచి సత్తా చాటిందని.. ఏపీలో మాత్రం జనసేన ఒంటరిగా పోటీ చేసేందుకు వెనుకంజ వేస్తోందని!. దీనిలో వాస్తవం లేకపోలేదు. 2019 ఎన్నికల్లో జనసేన దాదాపు ఒంటరిగానే బరిలో నిలిచింది. కమ్యూనిస్టులు, బీఎస్పీ వంటి వాటితో పొత్తు పెట్టుకున్నా.. అవి పెద్దగా లెక్కలోకిరాలేదు. ఒకరకంగా జనసేన ఒంటరి పోరాటమే చేసింది. కానీ, ఫలితం దక్కలేదు. . గ్రీన్ కార్డ్ కష్టాలతో అమెరికా వీడుతున్న భారతీయ దంపతులు దీంతోనే 2024లో పట్టుబట్టి టీడీపీ+ బీజేపీలను ఒకే వేదికపైకి చేర్చి జనసేన పోటీ చేసింది. తద్వారా తాను లబ్ధిపొంది.. ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది. ఇదే ఫార్ములాను వచ్చే 15 సంవత్సరాలు కూడా అమలు చేయాలన్నది జనసేన వ్యూహం. కానీ, ప్రత్యర్థులు.. అదేసమయంలో రాజకీయ విశ్లేషకులు మాత్రం జనసేన ఒంటరిగా ఎందుకు పోటీ చేయదంటూ.. మళ్లీ ప్రశ్నిస్తున్నారు. దీనికి విజయ్‌ను ఉదాహరణగా చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన ఒంటరిగా పోటీచేస్తే.. ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అనే ప్రశ్నలు తెరమీదికి వస్తున్నాయి. ఈ దఫా జనసేన ఒంటరిగా పోటీచేస్తే.. ఆ పార్టీకి ఖచ్చితమైన లాభం ఉంటుందన్న అంచనాలు వస్తున్నాయి. 2019లో లెక్కవేరు.. ప్రస్తుత లెక్క వేరని పరిశీలకులు చెబుతున్నారు. గత రెండేళ్ల కాలంలో పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా.. ఇతర శాఖ లమంత్రిగా చేస్తున్న పనులు, రాజకీయంగా పార్టీలో కొన్ని ఒడిదుడుకులు వచ్చినా.. ఆయన పాటిస్తున్న సంయమనం వంటివి సాధారణ ప్రజలను కూడా మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇక, అభివృద్ధిపరంగా కూడా.. పంచాయతీలను డెవలప్ చేస్తున్నారుఅంటే.. 2019 ఎన్నికల సమయంలో పవన్‌పై ఉన్న ఇమేజ్‌కు భిన్నంగా ఇప్పుడు పాలన పరంగా ఆయన ఇమేజ్ పెరిగిందన్న వాదన వినిపిస్తోంది. దీనికితోడు.. జనసేనలో క్షేత్రస్థాయి ఎమ్మెల్యే ల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ.. పార్టీ అధినేతగా పవన్‌కు ఎలాంటి మచ్చలు మరకలు లేవు. పైగా.. గ్రామీణ, గిరిజన, ఎస్సీ సామాజికవర్గాలకు ఆయన మరింత చేరువ అయ్యారు. పట్టణాలు, నగరాల్లోనూ 'ఫీల్ గుడ్ లీడర్'గా చూస్తున్నారు. ఈ పరిణామాలతో జనసేన కనుక ఒంటరిగా పోటీ చేసినా.. ఆ పార్టీకి లాభం చేకూరుతుందని మెజారిటీ విశ్లేషకులు చెబుతున్నారు. పైగా వైసీపీకి ఇది భారీ దెబ్బ అని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఏదైనా ఉంటే.. అది ఈ దఫా జనసేనకు పడుతుందని కూడా చెబుతున్నారు.

# చంద్రబాబు సరికొత్త ప్లాన్

విజయవాడ, మే 8

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు యువతరానికి ఇచ్చిన ప్రాధాన్యతను సీనియర్ నేతలకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. లేకుంటే భవిష్యత్ లో రాజకీయ పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో సీనియర్లు పదవులు లేక.. ప్రాధాన్యత లభించక తమలో తాము అసహనాన్ని అణుచుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం సీనియారిటీతో సంబంధం లేకుండా పనితీరుతోనే పదవులు లభిస్తాయని నిర్మొహమాటంగా చెప్పేశారు. దీంతో సీనియారిటీ, లాయల్టీ కంటే తెలుగుదేశం పార్టీలో హైకమాండ్ అడుగులకు మడుగులొత్తేవారికే పదవులు వస్తాయన్న అభిప్రాయం బలంగా కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారన్నా, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నా.. కేవలం ఆయన ఒక్కరివల్లనే కాదన్న విషయాన్ని ఇప్పుడు విస్మరించడం సరికాదంటున్నారు. పదవులు ఇవ్వకపోగా, తగిన గౌరవం ఇవ్వకపోతే సీనియర్ నేతల్లోనూ పార్టీ పట్ల అంకిత భావం దెబ్బతింటుందన్న భావన ఎక్కువగా వినపడుతుంది. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు లెక్క చేసే పరిస్థితుల్లో లేరు. తనకు పవన్ కల్యాణ్, బీజేపీ మద్దతు ఉంటే గెలుస్తామన్న నమ్మకంతోనే ఆయన లోకేశ్ టీంకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే గుర్రుగా ఉన్న కొందరు నేతలు మాత్రం పదవులు తమకు దక్కుతాయన్న ఆశతో ఉన్నారు.కానీ వారికి పదవులు లభిస్తాయన్న ఆశలు రోజురోజుకూ అడుగంటిపోతుండటంతో



పార్టీకి ప్రయోజనం చేయకపోయినా.. నష్టం చేయడం పెద్ద పనికాదన్న విషయం సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తమ పాలనలో ఉందంటున్న చంద్రబాబు పదవుల విషయంలోనూ సీనియర్లు, జూనియర్లను సమంగా చూడాలని కొందరు కోరుతున్నారు. పార్టీకి ఇంతకాలం వారి సేవలను విస్మరిస్తే రానున్న కాలంలో టీడీపీ పట్ల అంకిత భావంతో పనిచేసే వారు కనిపించరన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. చంద్రబాబు ఇటువంటి నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోరని, ఈసారి మాత్రం ఆయనలో మార్పు స్పష్టంగా కనిపిస్తుందని ఒక సీనియర్ నేత ఆవేదన పార్టీలో ఉన్న పరిస్థితికి అద్దం పడుతుంది. చంద్రబాబు ఇప్పటికైనా జాగ్రత్త పడకుంటే... రానున్న కాలంలో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

# 72 నియోజకవర్గాల్లోనే టీడీపీకి పాజిటివ్

గుంటూరు, మే 8,

ఏపీ అధికార పార్టీ టీడీపీలో 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అనే మాట వినిపిస్తోంది. కొందరు ఎమ్మె ల్యేలు.. పనితీరులో ముందుంటే.. మరికొందరు వెనుకబడుతున్నారు. ముందున్న నాయకులు.. తమకు అంతాబాగుందని చెబుతున్నారు. వెనుకబడుతున్నవారు.. నెపాన్ని సర్కారుపైనో.. అధికారులపైనో నెట్టేస్తున్నారు. దీంతో ఇటీవల క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలపై పార్టీ ఆరా తీసింది. అసలు ఏం జరుగుతోందో తెలుసుకుంది. 135 నియోజకవర్గాల్లో టీడీపీ విజయం దక్కించుకుంది. 72 నియోజకవర్గాలలో పరిస్థితి బాగుందని పార్టీకి రిపోర్టులు వస్తున్నాయి. మరి మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏంటి? అనేది ప్రశ్న. ఇదే అసలు సర్వేకు కారణమైంది. నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో నాయకులు దూకుడుగా వ్యవహరిస్తున్నవి.. 72 చోట్ల మాత్రమేనని అర్థమైంది. ఇక్కడ ప్రజలకు చేరువగా ఉండడమే కాకుండా కేంద్రం అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా.. నిధులు సమకూర్చుకుంటున్నారు. ఇలాంటి వాటిలో అనంతపురంలో మూడు నియోజకవర్గాలు.. చిత్తూరులో నాలుగు.. నెల్లూరు 3 ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా నియోజకవర్గాల లెక్క తేలింది. వీటిలో ఎంపీలతో సమన్వయం అవుతున్న ఎమ్మెల్యేలు.. వారికి సహకరిస్తున్న ఎంపీలు ఉన్న నియోజకవర్గాల్లో పరిస్థితి ఆశాజనకంగానేఉంది. కానీ, ఎమ్మెల్యేలు వర్సెస్ ఎంపీల మధ్య వివాదాలు ఉన్న నియోజకవర్గాల్లో ఇబ్బందులు పడుతున్నారు.ఈ క్రమంలోనే ఆయా నియోజకవర్గాలు వెనుకబడుతున్నాయని పార్టీ గుర్తించింది. దీంతో ఎమ్మెల్యేలు-ఎంపీల మధ్య సమన్వయం కోసం.. పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి కార్యాచరణ కూడా పూర్తయింది. ఒక్కొక్క ఎమ్మెల్యే ఒక్క తరహా రాజకీయం చేస్తుండడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. చేసుకునేందుకు.. చేసేందుకు కూడా అవకాశం ఉండి కూడా.. ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నవారిని గుర్తించి.. వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ విషయంలో గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి, విజయనగరం జిల్లాలుముందు వరుసలో ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఏలూరు జిల్లాలో దారుణం.

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని 12 లక్షలు సుపారి ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య

ఏలూరు మే 8

ఏలూరు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని 12 లక్షలు సుపారి ఇచ్చి భర్తను అతి కిరాతకంగా హత్య చేయించింది భార్య. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏలూరు జిల్లా కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామానికి చెందిన రెడ్డి సలోమన్ రాజు, రెడ్డి దుర్గామణి భార్యాభర్తలు. గత మూడు సంవత్సరాలుగా వడ్లమాను సచివాలయంలో పనిచేసిన పలగాని వెంకన్నబాబుతో అక్రమ సంబంధం పెట్టుకుంది. సదరు విషయం భర్త రెడ్డి సులోమన్ రాజు తెలియడంతో తన భార్యను తరచూ వేధిస్తూ, కొట్టేవాడు. దీంతో దుర్గామణి తన భర్తను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు వెంకన్నబాబుతో మాట్లాడి సుమారు రూ. 12 లక్షల రూపాయలు సాయి శ్రీనివాస్, జస్వంత్ రాయ్ లతో మాట్లాడి సుపారీ ఇచ్చి సాల్మన్ రాజును హత్య చేయించేందుకు ప్లాన్ చేశారు. గత నెల 17వ తేదీ రాత్రి సులేమాన్ రాజును కారులో ఎక్కించుకుని కొండపావులూరు సమీపంలోని జగనన్న ఇళ్ల సముదాయం వద్ద ఎన్డీఆర్ఎఫ్ గేటు దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ సులేమాన్ మెడకు చార్జింగ్ వైరు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని అక్కడే పడేసి, కారులో పరారయ్యారు. ఆగిరిపల్లి పోలీసుల విచారణలో అసలు విషయం బయటపడిందని ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఈ కేసులో భార్య తో పాటు నలుగురు ముద్దాయిలను కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులైన కలతోటి సాయిశ్రీనివాస్, మద్దాలి జశ్వంత్‌రాయ్, కలతోటి మణికంఠ, పలగాని వెంకన్నబాబు, రెడ్డి దుర్గామణిలను గన్నవరం వద్ద గురువారం అరెస్టు చేశారు. కారు, 5 సెల్‌ఫోన్లు, 5 బీరు సీసాలు, సెల్‌ఫోన్ పవర్ బ్యాంక్ చార్జింగ్ కేబుల్ వైరు, రూ. 75 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు

# మెజార్టీ లేనప్పుడు ఏం చేయాలి

చెన్నై, మే 8,

తమిళనాడు ఎన్నికల ఫలితాలలో టీవీకే అత్యధిక స్థానాలు సాధించింది. కానీ, గవర్నర్ విజయ్ ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేదు.. మెజారిటీ కి సరిపడా ఎమ్మెల్యేల మొదట తీసుకొని రావాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సూచించారు. దీనిపై అనేక రకాలుగా విమర్శలు వస్తున్నాయి.. గవర్నర్ తీసుకున్న నిర్ణయం పట్ల కొంతమంది విశ్లేషకులు మరో విధంగా చెబుతున్నారు. గవర్నర్ ముందు జాగ్రత్త తీసుకున్నారని అంటున్నారు.మనదేశంలో గతంలో అనేక రాష్ట్రాలలో గవర్నర్ల సూచన మేరకు కొన్ని ప్రభుత్వాలు హడావిడిగా ఏర్పాటయ్యాయి. విశ్వాస పరీక్ష ఎదుర్కోవడంలో విఫలమయ్యాయి. 1996లో కేంద్రంలో వాజ్ పేయి ప్రభుత్వం 13 రోజులు మాత్రమే ఉంది. అలాంటి ఘటనలు దేశానికి మంచివి కావని భావించి.. ప్రభుత్వాల ఏర్పాట్లు గవర్నర్లు సరైన విధానంలో వ్యవహరించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. "ఎస్ఆర్ బొమ్మై" కేసులో మనదేశ సర్వోన్నత న్యాయస్థానం అనేక మార్గదర్శకాలు జారీ చేసింది.. అప్పట్లో సర్కారియా, పూంచి కమిషన్లు అనేక సూచనలు చేశారు. నాడు సుప్రీంకోర్టు వాటిని సమర్థించింది కూడా.

సుప్రీంకోర్టు సమర్థించిన సర్కారియా, పూంచి కమిషన్లు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వాల ఏర్పాటు విషయంలో గవర్నర్లు ప్రాధాన్యతను పాటించాల్సి ఉంటుంది. ఎక్కువ స్థానాలకు వచ్చిన కూటమికి ముందుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పిలవాలి.. ఒకవేళ ముందుగా ఏర్పడిన కూటమికి మెజారిటీ రాకపోతే.. ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలి. ఒకవేళ అనేక పార్టీలు కూటమిగా ఏర్పడి.. మెజార్టీ ఉందని చూపిస్తే.. వాళ్లను ప్రభుత్వ ఏర్పాటుకు పిలవవచ్చు.

ఒకవేళ ప్రభుత్వంలో భాగంగాక పోయినప్పటికీ.. బయటనుంచి మద్దతు పలికే పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటే దానిని పరిశీలించవచ్చు.

ఒకవేళ ఏ పార్టీ కూడా మెజారిటీ అందుకోలేని పక్షంలో.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేనప్పుడు.. గవర్నర్ రాజ్యాంగం 356 ప్రకారం రాష్ట్రపతి పరిపాలనకు సిఫారసు చేసేందుకు అవకాశం ఉంటుంది.

సపోర్ట్ చేస్తున్న పార్టీల నుంచి ఎమ్మెల్యేల సంతకాలు చేసిన లేఖలను గవర్నర్ తీసుకోవాలని.. ఆయన స్వయంగా ధ్రువీకరించుకోవాలని పూంచి కమిషన్ స్పష్టంగా చెప్పింది. అయితే సుప్రీంకోర్టు ఈ విషయంలో ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

ఎక్కువ సీట్లు సాధించిన పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు.. అప్పటికే అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన మెజారిటీ.. ఈ అంశాల మీద ఎట్టి పరిస్థితుల్లో రాజ్ భవన్ లో నిర్ణయాలు సాధ్యం కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. కేవలం అసెంబ్లీలో మాత్రమే పార్టీలు బల నిరూపణ చేసుకోవాలని సూచించింది. గవర్నర్ ఒక నిర్ణయానికి రావడానికి అంటే ముందు ఎమ్మెల్యే సంతకాలు పరిగణలోకి తీసుకోవద్దని.. అసెంబ్లీలో ఓటింగ్ ను మాత్రమే చూడాలని సూచించింది. కర్ణాటకలో బొమ్మై ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ వెంకటసుబ్బయ్య.. మెజారిటీ లేదని రద్దు చేశారు. ఆ కేసు సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. కేసును విచారించిన సుప్రీంకోర్టు పై అంశాలను పేర్కొంది.

# హుందాగా వ్యవహరిస్తున్న స్టాలిన్

చెన్నై, మే 8,



రాజకీయ నాయకుల పరిస్థితి ఎలా ఉందంటే.. అధికారాన్ని దక్కించుకుంటేనేమో వారు గొప్ప నాయకులు. ఒకవేళ అధికారాన్ని కోల్పోతే మాత్రం ఈవీఎం లో అవకతవకలు.. గెలిచిన వారేమో తమను తాము గొప్పగా చెప్పుకుంటుంటే.. ఓడిపోయిన వారు తమ తప్పులను కాకుండా.. అదంతా ఈవీఎం ల మాయ అనే విమర్శలు చేస్తున్నారు. ఈవీఎంల ద్వారా గెలిచి.. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని ఆరోపిస్తున్నారు. వారు గెలిసినప్పుడు మాత్రం ఈ మాట మాట్లాడటం లేదు.ఆ మధ్య ఏపీలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. వైసిపి దారుణంగా ఓడిపోయింది. 11 స్థానాలకు మాత్రమే పరిమితం అయిపోయింది. అయితే ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అంచనా వేయలేక వైసీపీ దారుణమైన ఓటమిని మూటకటుకుంది. ఈ విషయాన్ని చెప్పలేక వైసీపీ నాయకులు తాము ఓడిపోయిన నెపాన్ని ఈ వియంల నెట్టడం మొదలుపెట్టారు. అంతేకాదు ఓట్ల నమోదుకు.. చివరి క్షణంలో ఎన్నికల సంఘం ఇచ్చిన లెక్కకు పోలిక సరిపోడం లేదని సరికొత్త ఆరోపణ తెరపైకి తీసుకొచ్చారు. వాస్తవానికి ఈవీఎం యంత్రాలను ఎవరూ హ్యాక్ చేయలేరు అనే విషయం అందరికీ తెలుసు కానీ ప్రజల్లో సానుభూతి పొందడానికి ఈ తరహా ప్రచారానికి వైసిపి శ్రీకారం చుట్టడం విశేషం.వైసిపి మాదిరిగానే పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా ఈ తరహా ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఎన్నికల్లో బిజెపి లూటీ చేసి గెలిచిందని ఆరోపించడం ప్రారంభించారు.. కేరళలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూటమి గెలిస్తే దాని గురించి మాట్లాడటం లేదు. అస్సాం, పశ్చిమబెంగాల్ లో బిజెపి గెలిస్తే మాత్రం మమత బెనర్జీ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. చివకి తమిళనాడులో ఏ పార్టీకి కూడా సరైన మెజారిటీ రాకపోయిన విషయాన్ని కూడా ఆమె గుర్తించడం లేదు. చివరికి తమిళనాడులో బిజెపి ఒకే ఒక ఎమ్మెల్యే స్థానంతో సరిపెట్టుకున్నప్పటికీ ఆమెకు అది కనిపించడం లేదు. పైగా రాహుల్ గాంధీ లాంటి నాయకులు మమతను సపోర్ట్ చేస్తున్నారు. అఖిలేష్ యాదవ్ లాంటి మాజీ ముఖ్యమంత్రి మమతకు జై కొడుతున్నారు. అసలు ఇటువంటి నాయకులను ఏమనాలో అర్థం కావడం లేదు.మరోవైపు ఇండియా కూటమిలోనే ఉన్న డీఎంకే మాత్రం తమిళనాడు ఎన్నికల విషయంలో సరికొత్తగా స్పందించింది.. ముఖ్యంగా డీఎంకే అధినేత స్టాలిన్ హుందాగా మాట్లాడారు.. ఆయన మాట్లాడిన మాటలు చాలామంది నాయకులకు గడ్డి పెట్టే విధంగా ఉన్నాయి.. "నేను గెలిచింది ఈవీఎంల మీదనే.. ఓడిపోయింది కూడా ఈవీఎంల మీదనే.. గెలిచాక నా సత్తా వల్లా అని.. ఓడిపోయిన తర్వాత ఈవీఎంలు హ్యాక్ అయ్యాయని అదంతా దద్దమ్మని కాదు. ప్రజల తీర్పు గౌరవించడం రానివాళ్లే అలా మాట్లాడతారు" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. స్టాలిన్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలను టిడిపి నేతలు ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఈవీఎంల మీద మాట్లాడే నాయకులకు స్టాలిన్ గడ్డపార స్థాయిలో రాడ్డు దింపారని వ్యాఖ్యానిస్తున్నారు.

# పార్టీని సెట్ చేస్తున్న రేవంత్

హైదరాబాద్, మే 8,

కాంగ్రెస్ పార్టీ లో ఒక సంప్రదాయం ఉంటుంది. అధికారం లేనంతవరకు అధికారం కోసం కొట్లాడుతూ ఉంటుంది. అధికారం దక్కిన తర్వాత పదవుల కోసం ఆ పార్టీలో కొట్లాటలు జరుగుతూ ఉంటాయి. అందువల్లే ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుంది అంటారు. కేవలం రాష్ట్రాలు మాత్రమే కాదు.. కేంద్రంలో కూడా అదేవిధంగా ఉంటుంది. అందువల్లే కాంగ్రెస్ పార్టీని సామాన్య ఓటరు అంతగా నమ్మనిది. కొంతమంది చరిష్మా ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీకి పెట్టని బలం మాదిరిగా ఉంటారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ బలం రేవంత్ రెడ్డి రూపంలో కనిపిస్తోంది.కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బలమైన గొంతు గా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు కనిపించారు. అందువల్లే ఆయనను తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయంగా చూశారు. 2023 ఎన్నికల్లో ఆయన ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు అందించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏలమని కోరారు. తెలంగాణ ప్రజలు తీసుకున్న ఈ నిర్ణయం భారత రాష్ట్ర సమితి సుప్రీం కెసిఆర్ కు మింగుడు పడలేదు. అయినప్పటికీ ప్రజా తీర్పును శిరసా వహించాల్సి ఉంటుంది కాబట్టి తప్పలేదు.తెలంగాణ రాష్ట్ర పగ్గాలు దక్కిన తర్వాత రేవంత్ రెడ్డికి అంత ఈజీగా ఏదీ లేదు. స్వపక్షంలోనే విపక్షం లాగా పరిస్థితి ఎదురయింది. సొంత పార్టీ నేతలు ఇబ్బంది పెట్టారు. ప్రత్యర్థి పార్టీలకు లీకులు కూడా ఇచ్చారు. ప్రభుత్వ పాలసీలను వివాదాస్పదం చేశారు. దీంతో అనేక రకాల వివాదాలు రేవంత్ రెడ్డిని చుట్టుముట్టాయి. ఎప్పుడైతే రేవంత్ రెడ్డి వరుస ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం మొదలుపెట్టారో.. అప్పుడే పరిస్థితి మారిపోయింది. అధిష్టానం కూడా రేవంత్ రెడ్డికి సరెండర్ అయిపోయింది.. దీంతో రేవంత్ రెడ్డి పార్టీ మీద పట్టు సాధించారు. తోక జాడిస్తున్న కొంతమంది పార్టీ పెద్దలకు చుక్కలు చూపించడం మొదలుపెట్టారు. దీంతో పార్టీలో రేవంత్ పెత్తనం పెరిగిపోయింది.ఇప్పుడు ప్రభుత్వంలో కూడా రేవంత్ తన దూకుడు తనం చూపిస్తున్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. ఇప్పటికే ఇందిరమ్మ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో గృహాలను నిర్మించారు. ఇంకా రెండవ దశ, మూడోదశలో కూడా గృహాలు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దివ్యాంగులకు.. త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. రైతులకు సంబంధించి పంట పెట్టుబడి సాయం విషయంలో కొన్త ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ.. వాటిని కూడా అధిగమించే ప్రయత్నం చేస్తున్నారు. సన్న ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఇవే కాకుండా త్వరలో చౌక దుకాణంలో ప్రజలకు జొన్నలు కూడా ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.. సంక్షేమ పథకాల విషయంలో కొత్త ఒరబడి సృష్టిస్తున్న రేవంత్.. పార్టీ పరంగా నామినేటెడ్ పదవుల విషయంలో కూడా అదే జోరు చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయా కులాలకు కార్పొరేషన్లను కేటాయించారు. పదవులు కూడా భర్తీ చేశారు. త్వరలో మిగతా పోస్టులను కూడా భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇలా చెప్పుకుంటూ పోతే రేవంత్ రెడ్డి అన్నిటిని సెట్ రైట్ చేసుకుంటూ వస్తున్నారు.దీర్ఘకాల సమస్యగా ఉన్న ఆర్టీసీ కి కొత్త దారిని చూపించారు రేవంత్. అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కార్మికులకు బకాయిలను చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాదు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు ఉన్న సమస్యలు మొత్తం అధిగమించాలని అధికారులకు సూచనలు చేశారు. అతి త్వరలో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం ఖాయమని రేవంత్ సంకేతాలు ఇస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలోనూ రేవంత్ ఉదారత చూపిస్తున్నారు. అందువల్లే ఉద్యోగులు ఇటీవల ఆయనను సన్మానించారు. ప్రభుత్వ పరంగా ఉన్న బకాయిలను ప్రతినెల 6వేల కోట్ల చొప్పున చెల్లించేందుకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తద్వారా ఉద్యోగుల సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపించారు. పిఆర్సి.. ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్ పేర్కొన్నారు. పెరిగిపోయిన అప్పులు.. రాబడి విషయంలో ఏదో అవుతున్న సవాళ్లు.. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు.. ఇన్ని రకాల సమస్యలు ఉన్నప్పటికీ రేవంత్ సావధానంగా వెళు_న్నారు. తన కాళ్లలో పుల్లలు వేస్తున్నప్పటికీ వాటిని ఏరుకుంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదే దూకుడు కనక రేవంత్ కొనసాగిస్తే ఖచ్చితంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ని మించిన స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పేరు తెచ్చుకుంటారని కార్యకర్తలు అంటున్నారు.

# చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో యాక్సెస్ కంట్రోల్ సిస్టం

హైదరాబాద్, మే 8,

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తరహాలోనే చర్లపల్లి స్టేషన్‌లోనూ వాహనాల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది. వాహనాల పికప్, డ్రాప్ కోసం 20 నిమిషాల వరకు ఉచిత సమయాన్ని కేటాయించగా.. ఆపై నిమిషాల ఆధారంగా రుసుము వసూలు చేయనున్నారు. డిజిటల్ టికెటింగ్, ప్రత్యేక లేన్లతో కూడిన ఈ విధానం వల్ల అనధికార పార్కింగ్‌కు చెక్ పడటంతో పాటు ప్రయాణికులకు సాఫీగా రాకపోకలు సాగించే వీలుంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.హైదరాబాద్ మహానగరంలో నాలుగో ప్రధాన రైల్వే టెర్మినల్‌గా అభివృద్ధి చెందుతున్న చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ ప్రాంగణంలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ట్రాఫిక్ జామ్ సమస్యలను నివారించడానికి అత్యాధునిక యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అమలు చేయనుంది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ ప్లాట్‌ఫాం వద్ద విజయవంతంగా నడుస్తున్న ఈ విధానాన్ని ఇప్పుడు చర్లపల్లికి కూడా విస్తరిస్తున్నారు. దీనివల్ల స్టేషన్ లోపలికి వచ్చే వాహనాల వివరాలు డిజిటలైజ్ చేయబడటమే కాకుండా.. అనధికారికంగా వాహనాలను నిలిపివేసే ధోరణికి అడ్డుకట్ట పడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.ఈ కొత్త విధానం ప్రకారం.. బైక్, ఆటో, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరుగా లేన్లను కేటాయించారు. స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి వాహనానికి ప్రవేశ సమయంతో కూడిన డిజిటల్ టికెట్ జారీ చేస్తారు. ప్రయాణికులను డ్రాప్ లేదా పికప్ కోసం వచ్చే వాహనాలకు మొదటి 20 నిమిషాల వరకు ఎటువంటి రుసుము వసూలు చేయరు. అంటే 20 నిమిషాలలోపు పని ముగించుకుని బయటకు వెళ్లే వారికి 'ఫ్రీ ఎగ్జిట్' సదుపాయం ఉంటుంది. అయితే నిర్ణీత సమయం దాటిన తర్వాత డిజిటల్ రసీదు ప్రకారం ఛార్జీలు వర్తిస్తాయి. నేరుగా పార్కింగ్ స్థలాలకు వెళ్లే వాహనాలకు ఈ అదనపు ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.కమర్షియల్ వెహికల్స్ అంటే బస్సులు, మినీ బస్సులకు కూడా 20 నిమిషాల ఉచిత సమయాన్ని కల్పించారు. ఒకవేళ 20 నుండి 30 నిమిషాల మధ్య ఉంటే రూ.100, 30 నుంచి 60 నిమిషాల వరకు ఉంటే రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలను గంట కంటే ఎక్కువ సమయం లోపల ఉంచడానికి అనుమతి లేదు. ఈ నిబంధనను అతిక్రమించే వారికి రూ.1000 వరకు భారీ జరిమానా విధించనున్నట్లు రైల్వే అధికారులు హెచ్చరించారు. ఈ కఠిన నిబంధనల వల్ల స్టేషన్ ఎంట్రన్స్ వద్ద అనవసరపు రద్దీ తగ్గి ప్రయాణికులు సకాలంలో ప్లాట్‌ఫాంలకు చేరుకునే అవకాశం ఉంటుంది.స్టేషన్‌లో గంటల ప్రాతిపదికన వాహనాలు నిలుపుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ రేట్లను ఖరారు చేశారు. కార్లకు మొదటి రెండు గంటలకు రూ.20, ఆ తర్వాత ప్రతి గంటకు రూ.10 చొప్పున వసూలు చేస్తారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు మొదటి రెండు గంటలకు రూ.15, ఆపై గంటకు రూ.10 చొప్పున ఛార్జీ ఉంటుంది. ఈ డిజిటల్ పేమెంట్, యాక్సెస్ కంట్రోల్ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ప్రయాణికులకు మెరుగైన రవాణా అనుభూతి లభిస్తుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది.

# జాతీయ గీతానికి రక్షణ ఉందని తెలుసా

హైదరాబాద్, మే 8,

వందేమాతరం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం పూర్తి గేయం పాడాలని ఇటీవల చట్టం చేసింది. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. వందేమాతరాన్ని జాతీయ గీతంతో సమానంగా గౌరవించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉద్దేశపూర్వక అవమానం, ఆటంకం, లేదా అడ్డంకి కలిగించే వారిని జైలుకు పంపాలని పేర్కొంది.ఇప్పటి వరకు 1971 నాటి చట్టం ప్రధానంగా జనగణమన, జాతీయ జెండా, రాజ్యాంగ గౌరవానికే రక్షణ కల్పిస్తోంది. కొత్త ప్రతిపాదన ద్వారా వందేమాతరానికీ అదే న్యాయస్థాయి వర్తింపజేయాలని కేంద్రం భావిస్తోంది. ఇది చట్టపరంగా జాతీయ గీతం, జాతీయ గేయం'' మధ్య ఉన్న రక్షణ తేడాను తొలగించింది.వందేమాతరాన్ని అవమానించే లేదా పాడటాన్ని అడ్డుకునే వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు, జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఈమేరకు కేంద్రం చట్టపరమైన రక్షణ కల్పించింది. ఇది ప్రతి సందర్భానికీ తక్షణ శిక్ష అన్న అర్థం కాదు. ఉద్దేశం, పరిస్థితి, చర్య తీవ్రత వంటి అంశాలను కోర్టు పరిశీలించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇది భావోద్వేగ ప్రతిస్పందన కంటే న్యాయపరమైన ప్రక్రియకు లోబడి పనిచేసే చట్టమే.ఈ నిర్ణయానికి సాంస్కృతిక కోణం ఎంత ఉందో, రాజకీయ సంకేతమూ అంతే ఉంది. వందేమాతరానికి ఉన్న చారిత్రక గుర్తింపును మరింత బలపరచడం ద్వారా, జాతీయతా భావనను కేంద్రం ముందుకు తెస్తోంది. అదే సమయంలో, ఈ అంశం దేశవ్యాప్తంగా భావోద్వేగ స్పందనలను రేకెత్తించే అవకాశం కూడా ఉంది.ఇలాంటి చట్టం దేశభక్తి చిహ్నాలపై గౌరవాన్ని పెంచుతుందని మద్దతుదారులు వాదించవచ్చు. కానీ మరోవైపు, గౌరవం చట్టబద్ధ శిక్షలతో ఎంతవరకు నిలుస్తుందన్న ప్రశ్న కూడా సహజమే. గీతాన్ని లేదా గేయాన్ని గౌరవించడం సామాజిక నైతికత నుంచి రావాలి. చట్టం దానికి తోడ్పడగలదు కానీ పూర్తి ప్రత్యామ్నాయం కాకపోవచ్చు.మొత్తంగా చూస్తే, వందేమాతరానికి రక్షణ కల్పించాలన్న కేంద్ర నిర్ణయం ఒక సాంస్కతిక?చట్టపరమైన ప్రకటన. దేశ గౌరవ చిహ్నాల పట్ల నియమబద్ధమైన గౌరవం ఉండాలన్న సందేశం ఇందులో ఉంది. అయితే ఈ సవరణ ఎంత దూరం అమలవుతుందో, పార్లమెంటులో ఆమోదం తర్వాత దాని పరిధి ఎలా రూపుదిద్దుకుంటుందో చూడాలి.

# టాప్ ప్లేస్‌లో బీసీ సంక్షేమ శాఖ..

## పవన్ కళ్యాణ్ శాఖకు చివరి స్థానం..!

విజయవాడ, మే 8,

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుకు సంబంధించి కీలక ర్యాంకులను ప్రకటించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారంగా ప్రభుత్వం ఈ ర్యాంకులను కేటాయించింది. మొత్తం 100 పాయింట్లకు గానూ 100 పాయింట్లు సాధించి బీసీ సంక్షేమ శాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలోని అటవీ మరియు పర్యావరణ శాఖ కేవలం 67 పాయింట్లతో చిట్టచివరి స్థానానికి పరిమితమైంది.ప్రభుత్వ శాఖల పనితీరును విశ్లేషించేందుకు ఈసారి 'ంఃఅఆ' గ్రేడింగ్ విధానాన్ని అమలు చేశారు. ఇందులో మెరుగైన ప్రదర్శన కనబరిచిన శాఖలకు 'ం' గ్రేడ్ కేటాయించగా, వెనుకబడిన శాఖలకు తక్కువ గ్రేడులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 18 శాఖలు 90 శాతానికి పైగా పాయింట్లు సాధించి ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నివేదిక వెల్లడించింది. అయితే, పర్యావరణం మరియు అటవీ శాఖ తక్కువ పాయింట్లు సాధించడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు సేవలందించడంలో పారదర్శకత, వేగం మరియు జవాబుదారీతనం ప్రాతిపదికగా ఈ గణాంకాలను సిద్ధం చేశారు.ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడమే లక్ష్యంగా శాఖల వారీగా ఈ సమీక్ష నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. వెనుకబడిన శాఖలు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, 90 శాతం కంటే ఎక్కువ ప్రజా సంతృప్తిని సాధించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. గతంలో పంచాయతీ రాజ్ వంటి శాఖల్లో పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేసినప్పటికీ, అటవీ శాఖలో ఆశించిన స్థాయిలో లక్ష్యాలను చేరుకోవడంలో ఆ శాఖ వెనుకబడినట్లు ఈ ర్యాంకులు సూచిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ లోపాలను సరిదిద్ది శాఖను పరుగులు పెట్టించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# కాళోజీ కళా క్షేత్రంలో భారీ జాబ్ మేళా: 4,000 మందికి ఉపాధి అవకాశాలు

## -నిరుద్యోగులకు మంత్రి కొండా సురేఖ పిలుపు

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మే8:

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ జాబ్ మేళాను యూత్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో. శుక్రవారం కాళోజి కలక్షేత్రంలో జాబ్ వేళా నిర్వహించడం జరిగింది.కాళోజీ కలక్షేత్రంలో నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది.వేలాది సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు.ఈ జాబ్ మేళా కి ముఖ్యఅతిథిగా అటవీ దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్ , జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా దేవాలయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జాబ్ మేళా ప్రాముఖ్యతను, సామాజిక బాధ్యతను జాబ్ మేళాకు వచ్చిన యువతీ యువకులకు వివరించారు. జాబ్ మేళా గతంలో కూడా నిర్వహించడం జరిగిందని, అది విజయవంతంగా సుమారు 11,600 మంది నిరుద్యోగులు ఎంపికయ్యారని, సుమారు 30 లక్షల రూపాయల సొంత ఖర్చుతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించినట్లు మంత్రి కొండా సురేఖ గుర్తుచేశారు.యువత ముఖాల్లోని ఆనందం తమకు ఎంతో తృప్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు.మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత వరంగల్ ప్రాంతంలోని మహిళలకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్వాహకులను కోరారు.హైదరాబాద్ వంటి నగరాల్లో హాస్టల్ వసతి, భద్రత పరమైన ఇబ్బందులు దృష్ట్యా, మహిళలకు వరంగల్‌లోనే అవకాశం కల్పించడం శ్రేయస్కరమని ఆమె అభిప్రాయపడ్డారు.యువతకు సూచన పురుషులు ఎక్కడ ఉద్యోగం వచ్చినా వెనకాడకుండా వెళ్లి చేరాలని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 10వ తరగతి నుంచి ఉన్నత చదువులు చదివిన వారందరికీ ఈ మేళాలో 72 కంపెనీల ద్వారా అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**సామాజిక బాధ్యత - రక్తదానం & అవయవదానం**

కేవలం ఉద్యోగాలే కాకుండా సామాజిక అంశాలపై కూడా యువత అవగాహన కలిగి ఉండాలని మంత్రి సూచించారు.

ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, అలాగే అవయవదానం పై సమాజంలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత చదువుకున్న యువతపై ఉందని చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఎంబిఏ పట్టా తీసుకునాన్ను ,ఇంకా డాక్టరేట్ అడ్మిషన్ తీసుకుంటున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు వెంటనే ఆర్డర్ కాపీలు అందజేయడం జరుగుతుందని, వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి కూడా త్వరలోనే అవకాశం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ సంధర్భంగా లిలిఎంపీ కడియం కావ్యలిలి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉద్యోగస్తులను తొలగిస్తున్నారు..కానీ మన వద్దకు 72 కంపెనీలలోని నాలుగు వేలకు పైగా ఉద్యోగాలు మన కోసం ఎదురు చూస్తున్నాయి అన్నారు.మన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.ఉద్యోగం లేదని బాధపడకుండా మనలోని నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటే ఎప్పుడైనా గొప్ప అవకాశాలు రావచ్చు అన్నారు.ఉద్యోగం వచ్చిన వెంటనే రిలాక్స్ అవ్వకుండా ఇంకా పై స్థాయికి ఎదగడానికి ఎప్పటికప్పుడు మనల్ని మనం మెరుగుపరుచుకుంటూనే ఉండాలి అన్నారు. నేను కూడా మెడిసిన్ చదివి డాక్టర్ అనే వృత్తితోనే ఆగిపోకుండా, ప్రస్తుతం ఎంపీ అయి దేశంలోని అనేక సమస్యలపై అనేక బిల్లులు, వాటి సవరణల పైన ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూనే ఉన్నాను.

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్ మాట్లాడుతూ నిరుద్యోగులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.ఈ మేళా ద్వారా ఐటీ, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి వివిధ రంగాల్లో సుమారు 4,000 ఉద్యోగ అవకాశాలు కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.యువతకు విలువైన సూచనలు ఇచ్చారు.నైపుణ్యం (స్కిల్స్ ): కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదని, నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాలు చాలా అవసరమని యువతకు సూచించారు.కష్టపడే తత్వం (హార్డ్ వర్క్ ): ఉద్యోగ సాధనలో అదృష్టం కంటే కష్టాన్నే నమ్ముకోవాలని, హార్డ్ వర్క్ మాత్రమే విజయానికి తొలిమెట్టు అని ఉద్ఘాటించారు.స్థానికతను వీడండి: ఉద్యోగం ఎక్కడ వచ్చినా వెళ్లడానికి సిద్ధంగాలిలి ఉండాలని, కేవలం వరంగల్ లేదా ఇంటి పక్కనే ఉద్యోగం చేయాలనే ఆలోచనకంటే మన మన నైపుణ్యం ఎక్కడ అవసరం అయితే అక్కడ ఉద్యోగలలు చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ జాబ్ మేళా నుద్దేశించి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి భారీ జాబ్ మేళా నిర్వహించబడింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.విస్తృత అవకాశాలు: ఈ మేళాలో సుమారు 72 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు..




ఐటీ, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి వివిధ రంగాల్లో కలిపి మొత్తం 4,000 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మహిళా సాధికారత: టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మసీ వంటి సంస్థలు మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక నియామకాలు చేపట్టాయని కలెక్టర్ తెలిపారు.రిజిస్ట్రేషన్లు: ఆన్‌లైన్ ద్వారా 2,600 మంది దరఖాస్తు చేసుకోగా, నేరుగా వచ్చిన వారితో కలిపి 4,000 మందికి పైగా అభ్యర్థులు వేళాకు హాజరయ్యారన్నారు.అభ్యర్థుల నైపుణ్యం ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు.యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ,డిబిసిడివో పుష్పలత, వరంగల్ ఖిలా వరంగల్ తాసిల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్ , యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రమేష్, సీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి, మెప్మా రేణుక, డి ఎం సివిల్ సప్లై సంధ్యారాణి, బీసీ ఎస్ఓ కిష్టయ్య, సంబంధిత అధికారులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## అధికారులు సమన్వయ కృషితో జిల్లాను అగ్రగామిగా నిలపాలి:: మంత్రి సీతక్క.

ములుగు జిల్లా ప్రతినిధి, మే 08 (భారత శక్తి): జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్య లక్ష్యంగా, అధికారుల సమన్వయంతో ములుగు జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని, ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా అక్షర మాలలో వెలిగి ఇతర జిల్లాలకు



ఆదర్శప్రాయంగా నిలవడం గర్వకారణంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,

డి ఫ్ ఓ వికాస్ మీనా లతో కలిసి జిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి,ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శాలువలతో సన్మానించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అన్ని శాఖల ఉన్నత అధికారులతో సవివరంగా పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధిని సాధించడంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని, ఇందులో భాగంగా ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

త్వరలోనే ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల స్థితిగతులపై పూర్తిస్థాయిలో ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో క్లియర్ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

నూతన గ్రామపంచాయతీ భవనాలకు అంచనాలను సిద్ధం చేసి యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. మౌలిక వసతులైనటువంటి కరెంటు, డ్రైనేజీ, తాగునీటి వంటి అత్యవసర పనులకు మాత్రమే నిధులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాఠశాలలు, వసతి గృహాలు పున ప్రారంభం అయ్యేలోపు వాటిలోని సమస్యలను మరమ్మత్తు పనులను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. అటవీ ప్రాంతాలలో ఉండే గ్రామాలలో కనీస సౌకర్యాల విషయంలో అటవీ అధికారులు గిరిజనులను ఇబ్బందులకు గురి చేయవద్దని త్వరలోనే ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అంతరించిపోయే వృక్షజాతులు, వివిధ రకాల పండ్ల మొక్కలతో ప్రత్యేకంగా పార్క్ ఏర్పాటు చేసే విధంగా చూడాలని, ఎక్కువ సంఖ్యలో ఇప్ప చెట్లను పెంచే విధంగా చూడాలన్నారు.

మేడారం మహా జాతరలో అద్భుతాలు సృష్టించిన మహిళా సంఘాల సభ్యులు అదే స్ఫూర్తితో రాబోయే గోదావరి పుష్కరాలకు కూడా ప్రత్యేక స్టాల్స్ నిర్వహించుకోవడానికి ముందుకు రావాలని డి ఆర్ డి ఏ ద్వారా వారికి సహాయ సహకారాలు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని తెలిపారు.

మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులను అప్రమత్తంగా ఉండే విధంగా సూచనలు జారీ చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఉద్దేశిస్తూ మంత్రి మాట్లాడుతూ అక్షరమాలలో ములుగు జిల్లాను ర్యాంకులతో వెలిగించినందుకు కృషిచేసిన విద్యార్థులను, తల్లిదండ్రులను ఉపాధ్యాయులను, అధికారులను అభినందించారు.

ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉండే డిమాండ్ కలిగిన మంచి సబ్జెక్టులలో ఉన్నత విద్యను అభ్యసించాలని, అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుతూ తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో వస్తున్న దరఖాస్తులు, ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వస్తున్న దరఖాస్తుల విషయంలో క్రమం తప్పకుండా ప్రతి మూడు రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తద్వారా ఫిర్యాదుదారులకు జవాబుదారితనం లభిస్తుందని పేర్కొన్నారు.

అన్ని శాఖల వారీగా పెండింగ్లో ఉన్న ఫైల్స్ వెంటనే క్లియరెన్స్ చేసుకోవాలని అధికారులు తూ.చా తప్పకుండా సమయపాలన పాటిస్తూ సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడానికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి, ఆర్డీవో వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# భైంసా మండల్ కొత్త తహసీల్దార్ శశి భూషణ్‌కు రూరల్ డీలర్స్ సంఘం ఘన సన్మానం.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 08(భారత శక్తి) భైంసా మండల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శశి భూషణ్ ని భైంసా రూరల్ డీలర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శేఖర్ సక్కెర, ఉపాధ్యక్షుడు సాయికుమార్, కోశాధికారి చంద్రకాంత్ పద్మవార్‌తో పాటు డీలర్లు



శ్యామ్ రావు, ముతన్న, రాజు సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ఈ సందర్భంగా వారు తహసీల్దార్ శశి భూషణ్ కు శుభాకాంక్షలు తెలియజేసి, మండల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# కుష్టు వ్యాధిగ్రస్తులకు నర్స్ గా సేవ చేశా..!

## - అంతర్జాతీయ నర్స్ డే వారోత్సవాలలో తన జ్ఞాపకాలను వెల్లడించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, మే 8:


సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇంటర్ నేషనల్ నర్సింగ్ డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నిర్మలా జగ్గారెడ్డి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ తాను రాజకీయాలలోకి రాకముందు నర్స్ గా పనిచేసిన అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఒక మారుమూల గ్రామం నుండి వచ్చిన తాను నర్సింగ్ వృత్తి మీద ఎంతో ఇష్టంతో బీఎస్సీ నర్సింగ్ చదువుకున్నానని తెలిపారు. నర్స్ గా ప్రభుత్వ ఉద్యోగం చేసస్తూ వృత్తి జీవితం లో




భాగంగా 8 సంవత్సరాలు కుష్టు రోగుల వార్డులో పని చేసి వారికి సేవలు అందించానని తెలిపారు. తన భర్త జగ్గారెడ్డి ప్రోత్సాహంతో ఉద్యోగం మానేసి రాజకీయాలలోకి వచ్చానని నర్సింగ్ విద్యార్థులకు తన అనుభవాలను వివరించారు.

# గంగుల వర్సెస్ బండి

కరీంనగర్, రాజకీయాల్లో అగ్గి రాజుకుంది. రాజకీయ ప్రత్యర్థులు అయిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో కరీనంగర్ సీపీ గౌస్ ఆలం, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. బీజేపీ నాయకులు కరీంనగర్‌లో పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి యత్నించారు. ఆయన తప్పించుకున్నారు. కానీ ఎమ్మెల్యే గంగల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై దాడి జరిగింది.ఇటీవల కరీంనగర్‌లోని పీంఎజే ఆభరణాల దుకాణంలో భారీ చోరీ జరిగింది. ఈ విషయంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సీపీ గౌస్‌ఆలంపై సంచలన ఆరోపణలు చేశారు. సీసీ చేతగానితనంతోనే చోరీ జరిగిందన్నారు. రక్షణ కల్పించంలో, దొంగలను పట్టుకోవడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కూడా చేష్టలు ఉడిగి చూస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ తంబాకు, డ్రగ్స్ కలిపి తీసుకుంటారని ఆరోపించాడు.



అందుకే తలపై వెంట్రుకలు ఊడిపోయాయని పేర్కొన్నాడు. కేటీఆర్ డ్రగ్ టెస్ట్‌కు సిద్ధమని, సంజయ్ కూడా సిద్ధం కావాలని డిమాండ్ చేశాడు. దీంతో బీజేపీ కార్యకర్తలు పాడి వ్యాఖ్యలపై మండిపడ్డారు. కరీంనగర్‌లో ఉన్న విషయం తెలుసుకుని ఆయనపై దాడికి బయల్దేరారు. తృటిలో ఎమ్మెల్యే తప్పించుకున్నారు.ఎమ్మెల్యే కార్యాలయంలోని కారు, కార్యాలయం అద్దాలను బీజేపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడకి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఉద్రిక్తతలు పెరగడంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేశారు.అనంతరం పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్యాంపు కార్యాలయంలోనే అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానే బాధితుడినని, తనపై రౌడీషీటర్లతో దాడి చేయించారని ఆరోపించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు తాను కౌంటర్ ఇచ్చానని, ఎవరినీ దుర్భాషలాడలేదని వెల్లడించారు.సాధారణంగా అధికార ప్రతిపక్షాల మధ్య గొడవలు జరుగుతుంటాయి. కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి కారణంగా ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులో దాడి చేశారు. తాజాగా ప్రతిపక్ష పార్టీలైన బిజెపి బిఆర్ఎస్ మధ్య గొడవ మొదలైంది. ఈసారి కరీంనగర్ లో బిజెపి కార్యకర్తలు దాడికి యత్నించారు.

====================

# సెల్ తీసుకోండి... జనగణన చేసుకోండి..
# ఆన్లైన్ ద్వారా అవకాశం..

## 11వ తేదీ నుంచి ఇంటింటికి జనగణన సిబ్బంది..

## ఫరూక్ నగర్ తాహసీల్దార్ నాగయ్య

లింగారెడ్డిగూడెం గ్రామంలో మార్ దాన్ వాక్ చేతిలో ఉన్న సెల్ ఫోన్ లేదా ఇంట్లో ఉన్న కంప్యూటర్ ద్వారా స్వీయ జనగణన చేసుకునేందుకు ప్రభుత్వం సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్కరికి కల్పించిందని షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ ఎమ్మార్వో నాగయ్య అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో స్వీయ జనగణన పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మార్ దాన్ వాక్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ జన గణ ఆన్లైన్ పై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈనెల పదవ తేదీ లోపు ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని వివరించారు. ఈనెల 13వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి జనగణన కోసం కేటాయించిన సిబ్బంది వస్తారని, ప్రజల స్వచ్ఛందంగా తమ వివరాలను అందించి సహకరించాలని సూచించారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు, కొనేంటి సాయికుమార్, గ్రామస్తులు నరేందర్ రెడ్డి, జంగయ్య యాదవ్, ప్రతాపరెడ్డి, దాదేమియా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

==========================

# ఆకాశవాణి వాకథాన్ విజయవంతం:
# స్టేషన్ హెడ్ ఇల్లందుల రవికుమార్



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)మే8:

ఆకాశవాణి వాకథాన్ విజయవంతం అయ్యిందని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారి, ప్రోగ్రాం హెడ్, స్టేషన్ ఇంచార్జ్ ఇల్లందుల రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆకాశవాణి 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శుక్రవారం ఉదయం వాక్ థాన్ నిర్వహించారు. ఆకాశవాణి ప్రాంగణం నుంచి ప్రారంభమైన వాక్ థాన్ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వరకు సాగి మళ్లీ ఆకాశవాణిని చేరుకున్నదన్నారు. విపత్కర పరిస్థితుల్లో సైతం ఆకాశవాణి సేవలు అద్వితీయమన్నారు. స్థానికంగా ఉన్నటువంటి కవులు, రచయితలు, కళాకారులు, వివిధ విభాగాల్లో పని చేస్తున్నటువంటి ప్రతిభావంతులతో, నిష్ణాతులతో పలు రకాల కార్యక్రమాలను అందించి వరంగల్ ఆకాశవాణి అందరి మన్ననలు పొందిందని అన్నారు. ఆకాశవాణి వరంగల్ కేంద్రానికి దేశంలోనే ప్రత్యేక స్థానం ఉందని, స్థానికంగా ఉన్నటువంటి ఎంతోమంది మేధావులు సైతం ఆకాశవాణి ద్వారా పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆకాశవాణి సేవలు అద్వితీయమని కొనియాడారు. 90 వసంతాల వేడుకల్లో గత 11 నెలలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను వాక్ థాన్ ద్వారా ప్రజలకు పునరంకితం కావాలని ఆశయంతో ఉన్నామని, నేటి వరకు ఇటువంటి వినూత్న, సృజనాత్మక కార్యక్రమాలు మరెన్నో శ్రోతలకి అందించనున్నామని తెలిపారు. గౌరవ అతిథిగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ ఉమా రెడ్డి హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకాశవాణి అనేక కార్యక్రమాలను రైతులకు చేరువ చేయడంలో ఇక్కడ ఉన్నటువంటి శాస్త్రవేత్తలు, అధికారులు ఎంతగానో తోడ్పడుతున్నారని, మునుముందు రైతులకు మరిన్ని కార్యక్రమాలు అందించాలని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పి.ఆర్.ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆకాశవాణితో తన చిరకాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి సిబ్బంది శ్రీనివాస్, శివ, నరేష్, విజయలక్ష్మి, శ్రీనివాసరాజు, శ్రీనివాస చారి, ఉషశ్రీ,, రామ్మూర్తి, రామ్మోహన్, అనిల్ ప్రసాద్ తో పాటు వ్యాఖ్యాతలు, విశ్రాంత ఉద్యోగులు, శ్రోతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమంగా కొండపైన తిష్ట వేసిన వర్తకసంఘం
# టెండర్లు నిర్వహించకపోతే సుప్రీంకోర్టును
# ఆశ్రయిస్తా: అన్నల్దాస్ వెంకటేష్

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 8: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వర్తకుల ఇష్టారాజ్యం నడుస్తుందని, దేవాదాయ శాఖతో పాటు యాదగిరిగుట్ట దేవస్థానం కూడా వారికి సంపూర్ణంగా సహకరిస్తుందని స్థానిక భక్తుడు అన్నల్దాస్ వెంకటేష్ ఆరోపించారు. యాదగిరిగుట్టలో శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వర్తకుల సొమ్ము ఏం పోయిందని, వర్తకం ముసుగులో వారంతా కోట్లకు పడగలెత్తారని, వర్తకులకు దేవాదాయశాఖ వత్తాసు పలుకుతోందన్నారు. దేవస్థానానికి గండికొట్టే వర్తకులకు ప్రత్యేకంగా దుకాణ సముదాయాలు నిర్మించి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. గతంలో ఒక్కో దుకాణానికి 8/10 ఫీట్లు విస్తీర్ణం దేవస్థానం కేటాయించిందని, కాలక్రమేణా కొండపైన వర్తకులు అదనంగా స్థలాన్ని ఆక్రమిస్తూ స్థలాభావం సృష్టించారని విమర్శించారు. ఆలయ విస్తీర్ణం కంటే ముందు 20 దుకాణాలు ఉండగా ఇప్పటికీ 10 దుకాణాలకే అద్దె చెల్లిస్తూ సుమారు 30 దుకాణాలు కొనసాగిస్తూ 112 మంది వర్తకులు వ్యాపారం చేసుకుంటున్నారని అన్నారు. సంఘం ఆధీనములోని దుకాణాలకు టెండర్ నిర్వహిస్తే ఏడాదికి సుమారు రూ. 30 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. దేవస్థాన అభివృద్ధికి భూములిచ్చిన రైతులకేమో మొండిచెయ్యి చూపారని ఆరోపించారు. నిరక్షరాసులైన రైతుల భూముల్లోనే దుకాణ సముదాయాలు నిర్మించి రైతులకు కనీసం ఉపాధి చూపకపోవడం దారుణమన్నారు. ఎలాంటి ఆస్తులు కోల్పోని వర్తకులకు అన్ని సదుపాయాలను దేవాదాయ శాఖ ఏర్పరుస్తుందని, కానీ కొండకు ఉత్తర దిక్కులోని భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. గత ప్రభుత్వం రైతుల జీవనోపాధికి ఉపాధి చూపలేకపోయిందన్నారు. కొండపైన దుకాణాల నిర్వాహణకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ వర్తక సంఘం పేరుతో కొంతమంది పైరవీలతో కొండపైన తిష్ట వేశారని విమర్శించారు. వర్తక సంఘంలోని దుకాణ సముదాయాలకు రెన్యువల్ పేరుతో టెండర్ నిర్వహించకుండా ప్రతి ఏడు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వర్తకులు ఏం ఆస్తులు పోగొట్టుకున్నారని రైతుల నుండి సేకరించిన భూముల్లో దుకాణ సముదాయాలు నిర్మించారని ఆయన నిలదీశారు. దేవస్థానం ఆదాయానికి గండి కొట్టడమే కాక అప్పటి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కొండపైకి చేరుకున్న వర్తకులకు ఇది దేవదాయ శాఖను మోసగించి దేవస్థాన ఆదాయానికి గండి కొట్టడం కాదా అని నిలదీశారు. వర్తక సంఘంలో దుకాణాలకు టెండర్ నిర్వహించాలని, లేనిపక్షంలో స్థానికుడిగా సుప్రీంకోర్టు కూడా ఆశ్రయిస్తానని హెచ్చరించారు.

# మొక్కజొన్నరైతుల కష్టాలు ఇంతింతకాదయా..
# వేధిస్తున్న గన్ని సంచుల కొరత

మహబూబ్ నగర్, మే 8, రోజుల తరబడి ధాన్యం విక్రయానికి రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినప్పటికీ, అందుకు అనుగుణంగా అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్క్ఫెడ్ ద్వారా పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ గన్ని సంచుల కొరత, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడ గోదాములు లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2400 రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. హమాలీ, రవాణా ఖర్చులు అధికంగా ఉండటంతో పాటు సకాలంలో దిగుమతులు జరగక రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అనేక మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు మొక్కజొన్న విక్రయిస్తున్నారు. మరికొందరు రూ. 25 నుంచి రూ. 30 వరకు చెల్లించి బయట గన్ని బ్యాగులను కొనుగోలు చేస్తున్నారు, ధాన్యం నింపినచోట అమాలికి బస్తాకు రూ 25లు, దిగుమతి వద్ద కూడా ఒక్కో బస్తాకు అదనంగా రూ. 5 వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక క్వింటాల్కు సుమారు రూ. 200 నుంచి రూ. 300 వరకు అదనపు భారం పడుతోందని తెలిపారు. మండలానికి ఒకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు అధికారులు సూచించిన గోదాములకు ధాన్యం తరలించాల్సి వస్తోంది. అక్కడ దిగుమతికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుండటంతో రవాణా ఖర్చులు మూడింతలు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రింబవళ్లు రోడ్లపైనే గడుపుతున్నప్పటికీ, గోదాముల్లో స్థలం లేదంటూ ఒకచోటు నుంచి మరొకచోటుకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యా ప్రగతికి ప్రణాళికాబద్ధంగా అడుగులు
# జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 08(భారత శక్తి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్నతో పాటు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే 11 నుండి 17 వరకు చేపట్టనున్న వారాంత కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, పెండింగ్లో ఉన్న సివిల్ పనులకు శంకుస్థాపనలు చేయాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ, ఇంటర్మీడియట్ విద్యార్థుల రెమెడియల్ తరగతులు పూర్తి చేసి, పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక రెమెడియల్ తరగతులను ప్రారంభించాలని తెలిపారు.

ఏడు రోజుల ప్రణాళికలో భాగంగా పలు వినూత్న కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. "సెలెక్టివ్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్" కింద నియోజకవర్గ స్థాయిలో సర్పంచులకు ప్రత్యేక వర్క్షాపులు నిర్వహించి, పాఠశాలల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా "జయశంకర్ బడిబాట", మెగా టీచర్-పేరెంట్ మీటింగ్, లైబ్రరీ డే, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు "కళావైభవం" పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, వారాంతంలో "విద్యా విజయోత్సవం" ఘనంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన పై అవగాహన ర్యాలీ

ములుగు జిల్లా ప్రతినిధి, మే 08 (భారత శక్తి) : జనగణన--2027లో ప్రతి పౌరుడు స్వయంగా తమ కుటుంబ వివరణ నమోదు చేసుకునేలా జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు

జనగణనపై ర్యాలీ నిర్వహించారు.

కలెక్టరేట్ కార్యాలయం వద్ద జనగణన పై అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరై, జనగణన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు జనగణన సిబ్బందికి సహకరించి సమాచారం అందించాలన్నారు.

శుక్రవారం ర్యాలీ కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రారంభించి జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్టాండ్ నుండి బండారుపల్లి రోడ్ గుండా కలెక్టరేట్ వరకు కొనసాగింది.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖలకు చెందిన

జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, యువత, విద్యార్థులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జనగణనపై అవగాహన కల్పించేందుకు భారీ మారథాన్
# నిర్వహణ జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 08(భారత శక్తి) దేశాభివృద్ధికి కీలకమైన జనగణన ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్మల్ పట్టణంలో భారీ మారథాన్ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ఈ మారథాన్ను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు.



అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, దేశ ప్రగతి, ప్రణాళికాబద్ధ అభివృద్ధికి జనగణన అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అని తెలిపారు. జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల ప్రణాళిక చేపడుతుందని వివరించారు.

జనగణన-2027లో భాగంగా ప్రతి పౌరుడు "స్వీయ గణన" (రావశ్రీట-జుఅబఎవతీఫ్అశీఅ) విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ వివరాలను ఆన్లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని కోరారు. అవగాహన లేని వారికి ఇతరులు సహకరించాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, సి పి ఓ జీవరత్నం, డి వై ఎస్పీ ఓ కాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, డీపీఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ పీజీ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ డిసిసి కార్యవర్గ సభ్యునిగా
# మామిండ్ల సురేష్ నియామకం

హనుమకొండ(భారత శక్తి)మే8:



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వుల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, కార్యవర్గ సభ్యుల నియమాకాలు ఖరారయ్యాయి. ఈ నియామకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇంగల వెంకట్రాంరెడ్డి తో సంప్రదించి ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి రావాలని పి సి సి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 31 డివిజన్ న్యూ శాయంపేట కు చెందిన మామిండ్ల సురేష్ కు జిల్లా కార్యవర్గ సభ్యునిగా అవకాశం దక్కింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందున ఈ పదవి ఆయనకు దక్కింది డిసిసి సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా మామిండ్ల సురేష్ పిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఎంపీ కడియం కావ్య, మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజుకు, కాంగ్రెస్ నాయకులు బట్టి శ్రీనివాస్, 31 డివిజన్ స్థానిక కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చూపు లేకుండా శిశువు జననం.. తల్లికి రూ. కోటి పరిహారం.
# వైద్యుల నిర్లక్ష్యంపై కమిషన్ సీరియస్.. బాధితురాలికి రూ. కోటి నష్టపరిహారం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 08(భారత శక్తి) ఆదిలాబాద్కు చెందిన భాగ్యశ్రీ అనే మహిళ గర్భధారణ సమయంలో పలు స్కానింగ్ పరీక్షలు చేయించుకోగా, శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు నివేదికలు ఇచ్చారు. అయితే ప్రసవం అనంతరం శిశువు రెండు కళ్లులేకుండా జన్మించడంతో బాధితురాలు తీవ్ర ఆవేదనకు గురైంది.

వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తూ ఆమె వినియోగదారుల కమిషన్ను ఆశ్రయించింది. కేసును విచారించిన కమిషన్ అధ్యక్షుడు జాబేజ్ శామ్యూల్ వైద్యుల సేవల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు గుర్తించారు.



దీంతో బాధితురాలికి రూ. 1 కోటి నష్టపరిహారం చెల్లించాలని, అదనంగా కోర్టు ఖర్చుల కోసం రూ. 34 వేలును కూడా ఇవ్వాలని సంబంధిత వైద్యులకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పు వైద్య రంగంలో సంచలనంగా మారింది.

## గుట్టలో ఎస్పీఎఫ్ సిబ్బంది 10కె రన్ -అనంతరం కళ్యాణకట్ట వద్ద 'స్వచ్ఛ భారత్'

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 8: తెలంగాణ రాష్ట్ర ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా ఆదేశాల మేరకు



యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బంది శుక్రవారం తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం కొండ కింద ఉన్న కళ్యాణకట్ట వద్ద 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలయ కార్యనిర్వహణ అధికారి జె. భవాని శంకర్ (ఉరూ) పాల్గొనగా ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్పిఎఫ్ ఇన్స్పెక్టర్ శేషగిరి రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పిఎఫ్ ఎస్ఐ రవి, ఏఎస్ఐలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## యాదాద్రి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ముందు నిరసన

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 8: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం గల కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి స్థానిక నిరుద్యోగులకు చెందేలా నూతన టెండర్లు వేయాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగులు శుక్రవారం హైదరాబాద్ లోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ముందు ప్లకార్డులతో ధర్నా నిర్వహించి అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మరియు రెవెన్యూ అండ్ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ లను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకుంటూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా అధిక రేట్లకు అమ్ముతూ భక్తులను ఇబ్బంది పెడుతున్న వర్తకసంఘాన్ని తక్షణమే రద్దు చేస్తూ టెండర్లు వేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. గతంలో కేవలం 30,40 షాపులే ఉండగా రాజకీయ పలుకుబడితో వాటిని ఇప్పుడు 114 షాపులుగా పెంచారని, రాజకీయ, అధికార బలంతో ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారని మండిపడ్డారు. స్వామివారి అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు కోల్పోలేదు, స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోగా వారికి ఎటువంటి న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వీరికి కొండక్రింద నూతనముగా



కొన్ని కోట్లు ఖర్చు చేసి దుకాణాలను నిర్మించడం జరిగిందని, ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి మరియు భక్తులకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, బండ రామస్వామి, దేవపూజ అశోక్, పల్లపు బాలయ్య, దండబోయిన వీరేష్, పబ్బాల ఉప్పలయ్య, మిరియాల కృష్ణ, ఆకుల అనిల్, బండి అనిల్, వంగపల్లి అరుణ్, మందోజు నరేష్, కొన్నె సంజీవ, కర్రె ప్రవీణ్, దార నవీన్, గోపగాని ప్రసాద్, జోరిగళ్ల ప్రశాంత్, కర్రె శ్యామ్, గుండు కుమార్, ఆరె కుమార్, దార క్రిష్ణ, పల్లపు రాజు, శ్రీనాథ్, వంశీ, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 08(భారత శక్తి) జిల్లాలో రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం నిల్వ విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తుగా అదనపు స్థలాలను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, గోదాముల లభ్యత, రవాణా సౌకర్యాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు లేదా గోదాములకు తరలించాలని సూచించారు. నిల్వ సామర్థ్యం సరిపోని పక్షంలో ప్రైవేట్ గోదాములు, ఇతర ఖాళీ ప్రదేశాలను గుర్తించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు అవసరమైన మేర లారీలు, హమాలీల సంఖ్యను పెంచాలని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రాల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో సరిపడా లైటింగ్ సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం తూకంలోనూ, రవాణాలోనూ ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 8 ( భారత శక్తి ) :బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రోజున ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేతుల మీదుగా బెల్లంపల్లి మండలం, బెల్లంపల్లి మున్సిపాలిటీ, నెన్నెల మండలం, కాసిపేట మండలం, తాండూర్ మండలాలకు చెందిన మొత్తం 141 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి



రూ. 1,00,116 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పడుతుందని, సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెరగడంలో కూడా ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ ధావ స్వాతి రమేష్ బాబు, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేరళ గెలుపులో రేవంత్ లెక్క...

హైదరాబాద్, మే 8,

ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి యూడీఎఫ్ విజయం దక్కించుకుంది. ఇక్కడి 140 అసెంబ్లీ స్థానాల్లో 102 స్థానాల్లో కూటమి గెలుపు గుర్రం ఎక్కింది. అయితే.. ఈ విజయంలో పలువురి పాత్ర ఉన్నప్పటికీ.. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రపైనే ఇప్పుడు ఆసక్తికర చర్చ సాగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో రేవంత్ కేవలం కేరళపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన ప్రచారం నిర్వహించారు. తొలి దశలో 7 రోజులు.. తర్వాత తర్వాత నాలుగు రోజుల చొప్పున ప్రచారంలో పాల్గొన్నారు. అయితే.. ఇది సాధారణ ప్రచారమైతే.. పెద్దగా చర్చ ఉండేది కాదు. కాంగ్రెస్ తరపున ఎంతో మంది ప్రచారం చేశారు కాబట్టి.. ఆ లెక్కలో కలిసిపోయేది. కానీ, రేవంత్ చేసిన ప్రచారం విభిన్నంగా సాగింది. ఆయన కేరళకు, తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య లింకు పెట్టి ప్రచారం సాగించారు. తిరువనంతపురం జిల్లా సహా.. పాలక్కాడు, పథనంతిట్ట వంటి తెలుగు వారి మూలాలు ఉన్న జిల్లాల్లో పెద్ద ఎత్తున రోడ్ షోలు.. ప్రసంగాలతో దంచి కొట్టారు. మరీ ముఖ్యంగా ఈ సమయంలో సీఎం పినరయి విజయన్‌ను ఢీ అంటే ఢీ అన్నట్టుగా రేవంత్ ఢీ కొట్టారు. ఆయనకు అనేక సవాళ్లు విసిరారు. పేద రికం నుంచి అవినీతి వరకు , నిరుద్యోగం నుంచి ఉపాధి కల్పన దాకా.. అనేక అంశాలను రేవంత్ ప్రస్తావించా రు. ఈ క్రమంలో ఇరువురు ముఖ్యమంత్రుల మధ్య లేఖల యుద్ధం కూడా కొనసాగిందిఇది కేరళ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలిసి వచ్చింది.

## ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి.

### -ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 08 (భారతశక్తి): జిల్లాలోని సుజాతనగర్ గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగం, ఇన్ పేషెంట్ విభాగం, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఔట్ పేషెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి రోజువారీగా నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల నిర్వహణ, ల్యాబ్ సేవల పరిస్థితి, పరీక్షల ఫలితాలను రోగులకు సమయానికి అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల స్టాక్, అవసరమైన మందుల లభ్యత, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సుజాతనగర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం, మొక్కజొన్న నిల్వల వివరాలను పరిశీలించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి



వారి సమస్యలను తెలుసుకున్నారు. మొక్కజొన్న తరలింపునకు తగినన్ని లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోడింగ్, రవాణా సమస్యల కారణంగా మొక్కజొన్న కేంద్రంలోనే నిల్వ ఉండిపోతుందని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి రవాణా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పి.ఆర్-126 రకం ధాన్యంలో "పిన్ పాయింట్ డ్యామేజ్" ఉన్నదనే కారణంతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని స్వీకరించడం లేదని రైతులు వివరించగా, దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతుల ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైనన్ని గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం రవాణా, నిల్వ, లోడింగ్ తదితర అంశాలలో సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, వైద్య అధికారులు డాక్టర్ రమేష్ కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంగ్లీ ఎక్కడ...

నల్గొండ, మే 8,

వాళ్లంతా పేదలు. వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వారిని కచ్చితంగా శిక్షించాలి. వారి తరఫున నేను పోరాడుతాను. అవసరమైతే హెల్ప్ చేస్తాను. ముందుగా వారిని పట్టుకోవాలి. ఈ కేసులో సంబంధం లేని వ్యక్తులపై విమర్శలు చేస్తున్నారు. నేను మీడియా ఫ్యామిలీ నుంచి వచ్చాను. మీడియా నాకు అండగా ఉండాలి. నామీద అడ్డగోలుగా రాయవద్దు. నేను బాధపడుతున్నాను. ఇబ్బంది పడుతున్నాను.. ఇదిగో ఇలా సాగిపోయింది మంగ్లీ ఆ మధ్య రెండు సార్లు విలేకరులతో మాట్లాడినప్పుడు సాగించిన మాటల పరంపర. ఆమె మాట్లాడిన మాటలకు.. క్షేత్రస్థాయిలో చేతులకు పొంతనలేదని పోలీసుల దర్యాప్తులో తేలిపోయింది. ఈ కేసులో ఇప్పటికి తెలంగాణ పోలీసులు అనేక రకాలుగా సమాచారాలను సేకరించినట్టు తెలుస్తోంది. మంగ్లీ సోదరుడి ఖాతాలోకి భారీగా జమైన డబ్బు.. ఆ డబ్బును డ్రా చేసిన తీరు.. ఇంకా అనేక అంశాలను గుర్తించారు. సాంకేతిక ఆధారాలు మాత్రమే కాకుండా.. ఇక అనేక రకాలైన కీలక ఆధారాలను సేకరించారు. ఆ తర్వాత తదుపరి ఏం చేయాలనేది పోలీసులు నిర్ణయం తీసుకోబోతున్నారు. ఈ ఎపిసోడ్ ఇలా సాగుతుండగానే మంగ్లీ గురించి మరోసారి న్యాయవాది సుబ్బారావు సంచలన ఆరోపణలు చేశారు.. "మంగ్లీ మీద, ఆమె సోదరుడు శివ మీద గద్వాల, గచ్చిబౌలి, నల్గొండ పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. దీనికి సంబంధించి వాళ్లు సమాధానం చెప్పాలి. మైక్రో ఫైనాన్స్ కేసు విషయంలో డిజిపి సివి ఆనంద్ ను కలిశాం. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలుస్తాను. బాధితులకు తిరిగి డబ్బులు చెల్లిస్తే ఖచ్చితంగా కేసులు వెనక్కి తీసుకుంటాం.. మైక్రో ఫైనాన్స్ స్కీం పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. సింగర్ మంగ్లీ, ఆమె సోదరుడు , ఇంకా కొంతమంది కోట్లలో మోసం చేశారు. ఈ విషయాన్ని నాకు హిమ కాంత్ రెడ్డి తెలిపారు.

## బాంబు డిస్పోజల్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 08 (భారతశక్తి):భద్రతా బలగాలతో పాటు సంయుక్తంగా నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్లలో మావోయిస్టులకు సంబంధించిన 06 డంప్ లను, 05 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో సమర్థవంతంగా విధులను నిర్వర్తించిన జిల్లా బాంబు డిస్పోజల్ బృందం సభ్యులను ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేసినటువంటి 10 ఐ.ఇ.డి లను కనుగొని వాటిని అత్యంత చాకచక్యంగా నిర్వీర్యం చేసిన బీడీ టీం సిబ్బందిని



అభినందిస్తూ క్లిష్ట పరిస్థితులలో బీడీ టీం ప్రదర్శించిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు ఎంతో గర్వకారణమని కొనియాడారు. సిబ్బందికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు సూచనలు చేస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అటవీ ప్రాంతాలలో తనిఖీలు చేసేటప్పుడు నిర్ణీత నిబంధనలను కచ్చితంగా పాటించాలని, స్వీయ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచనలు చేశారు. నూతన ఉత్సాహంతో పనిచేస్తూ ప్రతిభ కనబరిచిన 12 మంది బీడీ టీం పోలీస్ సిబ్బందిని శుక్రవారం ఎస్పీ అభినందిస్తూ వారికి ప్రశంసా పత్రాలు, రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆపరేషన్స్ రవి, బిడి టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతన అదనపు కలెక్టర్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మే 8:

సూర్యాపేట జిల్లా నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.హరి సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.




బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అదనపు కలెక్టర్ కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ కు జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సినిమా

# నిఖిల్ 'స్వయంభు' షూటింగ్
## అడవిలో చిక్కుకున్న చిత్ర బృందం!



నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'స్వయంభు'. కాగా, ఈ సినిమా షూటింగ్ సమయంలో తమకు ఎదురైన ఒక భయానక అనుభవాన్ని దర్శకుడు భరత్ కృష్ణమాచారి పంచుకున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణలో చిత్ర బృందం ఎదుర్కొన్న సవాళ్లను ఆయన మీడియాకు వివరించారు. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలను ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి సమీపంలో ఉన్న మారేడుమిల్లి అడవుల్లో చిత్రీకరించినట్లు భరత్ తెలిపారు. గతంలో 'పుష్ప' సినిమాలోని అటవీ సన్నివేశాలు చిత్రీకరించింది కూడా ఇదే ప్రాంతంలో కావడం గమనార్హం. అయితే, తాము మాత్రం ఇంతకుముందు ఎవరూ షూటింగ్ చేయని కొత్త ప్రదేశాలను ఎంచుకున్నామని ఆయన అన్నారు. ఆ ప్రాంతాలకు చేరుకోవడానికి జీపుల్లో రెండు నుంచి రెండున్నర గంటల సమయం పట్టేదని చెప్పారు. "ఒక షెడ్యూల్ సమయంలో అనుకోకుండా భారీ వర్షాలు పడటంతో, మా సిబ్బందిలో కొంతమంది దాదాపు ఒకటి రెండు రోజులు కొండపైనే చిక్కుకుపోయారు. వారు కిందికి వచ్చే మార్గంలేదు. వారి వద్ద కనీస సామాగ్రి కూడా లేదు" అని ఆ భయానక అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు.




# విజయ్ మౌనం నాకు నచ్చదు..
## త్రిష గతంలో ఏం చెప్పారంటే!

ఎన్నికల్లో పోటీ చేసిన మొదటిసారే ఘన విజయాన్ని సాధించారు నటుడు విజయ్. తమిళ ప్రజలు టీవీకే పార్టీకి స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సమస్యలు ఎదురవుతోన్న విషయం తెలిసిందే. ఇంతటి ఉత్కంఠ పరిస్థితుల్లోనూ విజయ్ మౌనంగా ఉండటాన్ని అందరూ చర్చించుకుంటున్నారు. ఈనేపథ్యంలో ఆయనతో కలిసి 5 సినిమాల్లో నటించిన త్రిష గతంలో విజయ్ మౌనంపై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. విజయ్ అందరి దృష్టిని ఆకర్షిస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే 'సైలెంట్ కిల్లర్'. అతడు ఏమీ చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆయన్ని అందరూ ఇష్టపడతారు. నిజం చెప్పాలంటే 'గిల్లి' సినిమా సమయంలో మా ఇద్దరి మధ్య అంత మంచి అనుబంధం ఉండేది కాదు. దర్శకుడు ధరణి, టీమ్ వల్ల మేము మంచి స్నేహితులమయ్యాం. విజయ్ చాలా మంచి వ్యక్తి. ఎప్పుడూ సహనంతో ఉంటాడు. నా జీవితంలో నేను ఎప్పుడూ ఇష్టపడే వ్యక్తుల్లో విజయ్ ఒకరు. సెట్‌లో ఉన్నప్పుడు విజయ్ అందరితో మాట్లాడకుండా ఓ మూల కూర్చొని గంటలతరబడి గోడ వైపు చూస్తూ ఉంటాడు. నాకు తనలో ఆ మౌనం నచ్చదు. నా దృష్టిలో హోమ్ అంటే ఇల్లు మాత్రమే కాదు, అది ఒక వ్యక్తి. నాకు అలాంటి వ్యక్తి విజయ్. అతడితో ఉంటే నాకు చాలా సేఫ్టీగా అనిపిస్తుంది. ప్రస్తుతం తమిళనాడులో రాజకీయ సంక్షోభం నెలకొన్న తరుణంలో.. త్రిష అన్నట్లుగానే తన 'మౌనం'తోనే విజయ్ ఈ రాజకీయ చదరంగంలో ఎలాంటి ఎత్తుగడలు వేయబోతున్నారో అని అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.




# అషురెడ్డి నిశ్చితార్థమైందా?..
## ఫొటోలు పంచుకున్న నటి

ఆర్థిక వ్యవహారాలు, వివాహానికి సంబంధించి వచ్చిన ఆరోపణలతో ఇటీవల వార్తల్లో నిలిచింది నటి అషురెడ్డి. తాజాగా సోషల్ మీడియాలో నిశ్చితార్థం ఫొటోలు పంచుకోవడం మళ్లీ చర్చకు దారి తీసింది. ఫొటోలు షేర్ చేస్తూ కెమెరా ఎమోజీ తప్ప మరే క్యాప్షన్ పెట్టకపోవడం గమనార్హం. నిజంగానే ఎంగేజ్‌మెంట్ అయిందా? మూవీ షూటింగ్‌లో భాగంగా ఇలా చేశారా? అన్నది తెలియాల్సి ఉంది.

# రామ్ చరణ్ 'పెద్ది' సెట్స్ పై
## చిరంజీవి సందడి..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యువ దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా సెట్స్‌పై తాజాగా మెగాస్టార్ చిరంజీవి సందడి చేశారు. ఈ విషయాన్ని దర్శకుడు బుచ్చిబాబు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిరంజీవి సెట్‌ను సందర్శించినప్పటి వీడియోను ఆయన షేర్ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు ఓ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. చిరంజీవిని ఉద్దేశిస్తూ, "పెద్ది సెట్స్‌లో బాస్ మరియు నా గురువు. ఇది నా జీవితంలో అత్యుత్తమ జ్ఞాపకాలలో ఒకటి. అవును.. 'పెద్ది' స్ఫూర్తితో నేను కూడా కొంచెం కండలు పెంచాను" అని పేర్కొన్నారు. తన అభిమాన హీరో, గురువు సెట్‌కు రావడంతో బుచ్చిబాబు ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, చిరంజీవితో పాటు దర్శకుడు సుకుమార్ కూడా 'పెద్ది' సెట్స్‌ను సందర్శించారు. రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# 'ఇన్‌స్పెక్టర్ అవినాష్2'
## ఊర్వశి కొత్త అవతారం



యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ఇన్‌స్పెక్టర్ అవినాష్' రెండో సీజన్‌లో నటిస్తున్న బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సిరీస్‌లో ఆమె నమ్మకమైన భార్య పూనమ్ మిశ్రా పాత్రను పోషిస్తున్న సంగతి తెలిసిందే. రెండో సీజన్‌లో తన పాత్రకు చోదకశక్తిగా నిలిచే భావోద్వేగం "మౌనంలో దాగి ఉన్న అస్తిత్వ పోరాటం" అని ఆమె తెలిపారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "ఈ సీజన్‌లో నా పాత్రను నడిపించే బలమైన భావోద్వేగం.. నిశ్శబ్దంలో దాగి ఉన్న మనుగడ. క్రైమ్ డ్రామాలలో చాలామంది హింస, అధికారం, యాక్షన్‌ను మాత్రమే చూస్తారు. కానీ, వాటి కింద భయం, భావోద్వేగ ఒంటరితనం దాగి ఉంటాయి. నా పాత్ర ఈ అంతర్గత సంఘర్షణను చాలా లోతుగా మోస్తుంది" అని వివరించారు. తన పాత్ర కేవలం భావోద్వేగాలతో కాకుండా, సంయమనంతో నడుస్తుందని ఊర్వశి పేర్కొన్నారు. "కొన్నిసార్లు బలం అంటే దూకుడుగా ఉండటం కాదు, నిశ్శబ్దంగా భరించడంలోనే అసలైన బలం ఉంటుంది. ఈ భావోద్వేగ సంక్లిష్టతే నన్ను ఈ పాత్రకు ఆకర్షించింది" అని ఆమె అన్నారు. యూపీకి చెందిన సూపర్ కాప్ అవినాష్ మిశ్రా నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కింది. ఇందులో బాలీవుడ్ నటుడు రణ్‌దీప్ హుడా టైటిల్ రోల్‌లో నటించారు. మొదటి సీజన్ 2023లో విడుదలైంది. కాగా, బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన ఊర్వశి రౌతేలా, 2025లో నందమూరి బాలకృష్ణ సరసన 'డాకు మహారాజ్' చిత్రంతో టాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ చిత్రంలోని 'దబిడి దిబిడి' పాట సోషల్ మీడియాలో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు.

# అప్పట్లో సౌత్ వైపు వెళ్తే
## అలాగే చూసేవారు: సమీరారెడ్డి

దక్షిణాది సినిమాలపై తనకున్న గౌరవాన్ని సినీ నటి సమీరారెడ్డి మరోసారి చాటుకున్నారు. తన కెరీర్ ఆరంభంలో నాటి అనుభవాల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు. సమీరారెడ్డి కెరీర్ మొదట్లో హిందీ సినిమాలతో బిజీగా ఉన్నప్పుడు, ఆమె టీమ్ సభ్యులు దక్షిణాది సినిమాల వైపు వెళ్లొద్దని హెచ్చరించారట. "హిందీలో అవకాశాలు లేని వారే సౌత్ వైపు వెళతారు" అనే తప్పుడు అభిప్రాయం అప్పట్లో ఉండేదని ఆమె గుర్తు చేసుకున్నారు. కానీ, ఒక సౌత్ ఇండియన్ అమ్మాయిగా తన మూలాలను గౌరవిస్తూ, ఆ మాటలను పక్కన పెట్టి జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్ల సరసన నటించడానికి ఆమె సిద్ధపడ్డారు. చిరంజీవి, ఎన్టీఆర్, సూర్య, అజిత్ వంటి దిగ్గజాలతో పనిచేయడం తన కుటుంబానికి, ముఖ్యంగా తన తండ్రికి గర్వకారణమని ఆమె సగర్వంగా చెప్పకొచ్చారు. ప్రస్తుతం బాలీవుడ్ అగ్ర హీరోయిన్లు సౌత్ సినిమాల కోసం పోటీ పడుతున్న విషయాన్ని సమీరా గుర్తు చేశారు. దక్షిణాది దర్శకులు కొత్త ప్రయోగాలు చేయడానికి, రిస్క్ తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందుకే ఇక్కడి



సినిమాలు సాంకేతికంగా, యాక్షన్ పరంగా ఎప్పుడూ ముందంజలో ఉంటాయని ఆమె విశ్లేషించారు. హిందీ మేకర్స్ తరచుగా 'సేఫ్ జోన్'లో ఉండాలని చూస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. దాదాపు దశాబ్ద కాలం పాటు వెండితెరకు దూరంగా ఉన్న సమీరా, ఇప్పుడు సంజయ్ దత్ సరసన 'ఆఖరి సవాల్' చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. ఇది తన కమ్ బ్యాక్ కాదని, కేవలం ఒక చిన్న విరామం తర్వాత చేస్తున్న ప్రయాణమని ఆమె స్పష్టం చేశారు.

# పంట మార్చితే ప్రభుత్వం రైతులకు గోసే మిగిల్చింది


* మిరుదొడ్డి మార్కెట్‌లో ధాన్యం కొనక రైతులకు ఇక్కట్లు
* కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి
* స్పందించకపోతే వంటావార్పుతో నిరసన హెచ్చరిక
* బీఆర్ఎస్ నేత తోట కమలాకర్ రెడ్డి





సిద్దిపేట, మే 8 (భారత శక్తి): రైతులు పంట మార్చితే కాంగ్రెస్ ప్రభుత్వం వారికీ గోస మిగిల్చిందని, వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల రోజులుగా పొద్దుతిరుగుడు, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కాక మార్కెట్ యార్డులోనే నిల్వ ఉండిపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మార్కెట్ యార్డును సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సూచించిన మేరకు రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారని, ఇప్పుడు కొనుగోళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు కూడా లేవని, ధాన్యాన్ని కప్పేందుకు పాలిథిన్ కవర్లు సైతం అందించడం లేదని అధికారులపై మండిపడ్డారు. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం గోసనే మిగిల్చిందని విమర్శించారు.వెంటనే లారీల ద్వారా మొక్కజొన్న,పొద్దుతిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చే సోమవారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి వంటావార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.
రైతుల ఆందోళనలను అణచివేయడానికి అధికారులు, పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తే సహించబోమని స్పష్టం చేశారు. రైతు కష్టాన్ని పట్టించుకోని ఈ ప్రభుత్వానికి అన్నదాతల ఆవేదన తప్పదని, అధికారంలోకి వచ్చి రైతులను గాలికొదిలేసిందని తోట కమలాకర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు.కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు ఉన్నారు.

## హత్య, దొంగతనం కేసులో అరెస్టైన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రవీణ్ సస్పెన్షన్



సిద్దిపేట, మే 08 (భారత శక్తి): సిద్దిపేట జిల్లాలోని సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ప్రవీణ్‌ను హత్య మరియు దొంగతనం కేసుల్లో అరెస్టు కావడంతో సస్పెండ్ చేస్తూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఉత్తర్వులు జారీ చేశారు.పోలీస్ శాఖలో పనిచేస్తూ నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు లేదా అసాంఘిక చర్యల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా మరియు శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.శాఖ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఎవరినీ ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## అల్లిపూర్‌లో ఆధ్యాత్మిక వైభవం..

* - శ్రీ ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి





సిద్దిపేట, మే 8 ( భారత శక్తి ): సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లిపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ స్వాములు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, "జై శ్రీరామ్" నినాదాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తి పారవశ్యాన్ని నింపింది. వంగ రాజేశ్వర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుంది. భక్తి భావన సమాజానికి సత్సమాజ నిర్మాణంలో దోహదపడుతుంది" అని అన్నారు.ఈ మహోత్సవంలో భక్తులు, హనుమాన్ స్వాములు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల రద్దీతో అల్లిపూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.అనంతరం కత్తెర రమేష్ రెడ్డి నివాసంలో నిర్వహించిన హనుమాన్ స్వామి భిక్ష కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు
## పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

* ఘనంగా సత్కరించిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మనీష్ గౌడ్



హైదరాబాద్, మే 8 (భారత శక్తి) : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలు బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పీసీసీ మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, యువ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మంత్రి నివాసానికి చేరుకున్న ముద్దగౌని బృందం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామ్మోహన్ గౌడ్ మంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రజా సేవలో మంత్రి పొన్నం ప్రభాకర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.

**ఎల్బీనగర్ అభివృద్ధిపై చర్చ..**

మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పలు అభివృద్ధి అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, ముద్దగౌని అనుచరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా రుణ పరిమితి పెంపుపై మహిళా సంఘాల హర్షం

* రూ. 10 లక్షలకు పెంచడంపై సర్వత్రా స్వాగతం.. పలుచోట్ల సంబరాలు
* *ఇబ్రహీంపట్నం, మే 8: భారత శక్తి




స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల్లో ఐకేపీ ఏపీఎంలు, మహిళా సంఘాల ప్రతినిధులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు.ముఖ్యమంత్రి,మంత్రులు,స్థానిక ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు.

**స్వయం ఉపాధికి మరింత ప్రోత్సాహం:**

గతంలో రుణ పరిమితి రూ. 5 లక్షల వరకే ఉండటంతో పెద్ద ఎత్తున వ్యాపారాలు ప్రారంభించడానికి నిధుల కొరత ఎదురయ్యేదని



మహిళలు పేర్కొన్నారు. ఇప్పుడు ఆ పరిమితిని రెట్టింపు చేయడంతో కొత్త యూనిట్ల స్థాపనకు, స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి మార్గం సుగమమైందని వెల్లడించారు. ఇప్పటికే పలు సంఘాలు ఆర్టీసీ బస్సులు, క్యాంటీన్లు, డెయిరీ ఫామ్‌లు, సోలార్ యూనిట్లను విజయవంతంగా నిర్వహిస్తున్నాయని, తాజా నిర్ణయం మహిళా సాధికారతకు మరింత ఊతమిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రొటీన్లతో అలసట మాయం!



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్‌స్టైల్‌తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు.**

**నట్స్**

ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

**పాలు, పాల పదార్థాలు**




కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

**సోయాబీన్స్**

సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

**ఇవి కూడా!**

* బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
* చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
* మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా



ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు.

* కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి.

## పోషకాల ఖర్జూరాలు..
# అందుకే ఎంతో మేలు!

**రంజాన్ మాసంలో ఆచరించే కఠిన ఉపవాస దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉంది. రోజూ ఈ దీక్ష విరమించేటప్పుడు తీసుకునే ఆహార పదార్థాల్లో 'ఖర్జూరాలు' తప్పకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే ఈ పండు ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.**

* పొటాషియం ఎక్కువగా లభించే ఖర్జూరాలు తినడం వల్ల గుండె కొట్టుకునే రేటు, రక్తపోటు అదుపులో ఉంటాయట. అలాగే గుండె సంబంధిత సమస్యలు దరిచేరకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు నిపుణులు.
* ఖర్జూరం పండ్లలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, విటమిన్లు, ఇతర పోషకాలు అధికంగా ఉంటాయట. ఇవి సంపూర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం.
* ఖర్జూరాల్లో కొలెస్ట్రాల్ తక్కువగా.. ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇవి తింటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగి.. బరువు అదుపులో ఉంచుకోవచ్చు.
* క్యాల్షియం, మెగ్నీషియం, కాపర్.. వంటి ఖనిజాలు ఈ పండులో అధికంగా లభిస్తాయి. క్యాల్షియం ఎముకలను, దంతాలను దృఢంగా ఉంచడానికి.. కాపర్ ఎర్రరక్తకణాల ఉత్పత్తికి.. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.
* ఖర్జూరాలు కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాదు.. బాగా సన్నగా ఉండి బరువు పెరగాలనుకునే వారికీ మంచి ఫలితాన్నిస్తాయంటున్నారు నిపుణులు.



* ఖర్జూరం పండు శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. అందుకే రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో ఈ పండుని ఆహారంగా తీసుకుంటారు.
* మలబద్ధకంతో బాధపడేవారు కొన్ని ఖర్జూరాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున వాటిని తిని, ఆ నీరు తాగితే మంచి ఫలితం ఉంటుందట.
* ఖర్జూరంలో ఉండే వివిధ పోషకాలు శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేయడంలో సహకరిస్తాయి.
* ఖర్జూరాల్లో ఉండే విటమిన్ 'బి6' వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందట.
* శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ ఖర్జూరాలు తమ వంతు పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు.

# జలమండలి ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భేటీ

ఎల్బీనగర్, మే 08 (భారత శక్తి): ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం జలమండలి & సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా చంపాపేట్ డివిజన్ (కర్మన్‌ఘాట్) పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణ చేయాలని కోరారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో అధిక సంఖ్యలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలే ఉన్నాయని తెలిపారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా ప్రజలు బోర్‌వెల్‌లపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో బోర్‌వెల్‌కు సంబంధించిన విద్యుత్ బిల్లులను జీహెచ్ఎంసీ చెల్లించగా, అనంతరం జలమండలి వారు తమ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం రూ.6,38,641/ బకాయిని కాలనీవాసులే చెల్లించాలని విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే పునరుద్ధరించి బకాయి బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం వచ్చే బిల్లులను అసోసియేషన్ వారే కట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.అదే విధంగా బి.యన్.రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ పరిసరాల్లో ట్రంక్ లైన్ పనుల అంశాన్ని కూడా ఎం.డి. దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ కాంప్లెక్స్ నుంచి



వచ్చే డ్రైనేజీ నీరు సరైన అవుట్‌లెట్ లేక గుర్రంగూడ ఫారెస్ట్ హరిహారపురం కాలనీలోకి చేరుతూ ఫారెస్ట్ ప్రాంతంలోని రెండు చెరువులు మురికికూపాలుగా మారిపోయాయని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన ట్రంక్ లైన్ మంజూరు చేయాలని కోరారు.అలాగే ప్రస్తుతం సరూర్‌నగర్ చెరువు పరిధిలో 2.5 ఎంఎల్డి సామర్థ్యం మాత్రమే ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దానిని 9 లేదా 10 ఎంఎల్డి వరకు పెంచాలని సుధీర్ రెడ్డి గారు కోరారు. దీనివల్ల చెరువులో కలుషిత నీరు తగ్గడంతో పాటు దుర్వాసన సమస్య తగ్గి, నీటి నాణ్యత మెరుగుపడి పరిసర కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.అలాగే నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యలు కూడా పరిష్కారం చేయాలనీ కోరారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.అనంతరం ఎండి అశోక్ రెడ్డి మాట్లాడుతూ, తప్పకుండా సుధీర్ రెడ్డి చెప్పిన అంశాలను పరిగణనలో తీసుకొని సంబంధించిన అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కటికరెడ్డి అరవింద రెడ్డి,గండికోట శ్రీనాథ్ పలువురు కాలనీవాసులు ఆనంద్,దివాకర్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఐటీఐ–ఏటీసీ దుబ్బాకలో అడ్మిషన్లు ప్రారంభం



* **అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ కనకయ్య**

దుబ్బాక, మే 8 (భారత శక్తి): ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) / అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), దుబ్బాకలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు సంస్థ ప్రిన్సిపాల్ జి. కనకయ్య తెలిపారు. ఈ సందర్భంగా అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు ఐటీఐ/ఏటీసీలో వివిధ ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రతినెల రూ.2,000 స్కాలర్‌షిప్ అందజేస్తుందని తెలిపారు.సంస్థలో అనుభవజ్ఞులైన బోధకులచే నాణ్యమైన శిక్షణతో పాటు ఆధునిక యంత్ర సామగ్రితో ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించబడుతుందని వివరించారు. శిక్షణ పూర్తైన అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సంస్థను సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు.అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ప్రభుత్వ ఐటీఐ-అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, దుబ్బాక కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ పి. యాదగిరి, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు పీరాజీ, రాజు, అతిఫ్, సాయి, భరత్, రక్షిత్, శశిధర్, సురేష్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దటమే మా లక్ష్యం

- **గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలి**
- **బీజీ వెంకటాపూర్ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్ ముదిరాజ్**

సిద్దిపేట , మే 8 (భరత శక్తి ): సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం బీజీ వెంకటాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని గ్రామ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, ముఖ్య నాయకులతో ఆదర్శ గ్రామ నిర్మాణంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాల వికాస్ సంస్థ తమ గ్రామాన్ని దత్తత తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలోని ప్రతి వీధి నుంచి ప్రజలు ఈ పథకంలో భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని, ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక్కరు గ్రామసభకు హాజరయ్యేలా అవగాహన కల్పిస్తామని చెప్పారు.గ్రామ అభివృద్ధి కోసం




పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నిర్వహించే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేసి, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ మంజుల మాట్లాడుతూ, బాల వికాస్ సంస్థ గత 40 సంవత్సరాలుగా తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తోందన్నారు. గ్రామాల్లో స్థిరమైన మార్పు రావాలంటే నాయకులు, ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో ఉపసర్పంచ్ బాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు, బాల వికాస్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రమేష్, డెవలప్మెంట్ ఏజెంట్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యువత భవితకు పోలీసు 'రక్ష'.. మత్తు నెట్వర్క్‌పై ఉక్కుపాదం!

* **డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం: మల్కాజిగిరి సీపీ సుమతి**
* **హాస్టళ్లపై డ్రోన్ల నిఘా.. అనుమానం వస్తే అక్కడికక్కడే డ్రగ్ టెస్టులు**

ఎల్బీనగర్, మే 8 (భారత శక్తి) : భావి భారత పౌరులైన యువతను మత్తు రక్కసి కోరల నుంచి కాపాడేందుకు పోలీస్ యంత్రాంగం సరికొత్త వ్యూహాలకు పదును పెట్టింది. నగర ప్రొడక్టివిటీకి చిరునామాగా, వేలాది మంది విద్యార్థుల విద్యా కేంద్రంగా ఉన్న దిల్సుక్ నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి వెల్లడించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

**డ్రోన్ పోలీసింగ్.. టెక్నాలజీతో చెక్!**

నేరగాళ్ల కంటే ఒక అడుగు ముందే ఉండాలన్న సంకల్పంతో అత్యాధునిక సాంకేతికతను పోలీసులు రంగంలోకి దించారు.

**డ్రోన్" ఆకాశం నుంచి నిఘా:**

* అర్ధరాత్రి వేళల్లో విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిశితంగా పర్యవేక్షించనున్నారు.

**స్పాట్ టెస్టులు:**

* రాత్రిపూట పెట్రోలింగ్ చేసే పోలీసులకు ప్రత్యేక 'డ్రగ్ డిటెక్షన్ కిట్లు' అందజేశారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులకు తక్షణమే పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకుంటారు.

**సిసి కెమెరాల కవచం:**




ఈ ప్రాంతంలోని 3,200 కెమెరాలలో 70% పైగా క్రియాశీలంగా ఉన్నాయని, వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించినట్లు సీపీ తెలిపారు.

* **హాస్టళ్లపై ప్రత్యేక ఆడిట్.. నిర్వాహకులకు హెచ్చరిక**

సరూర్ నగర్ పరిధిలోని హాస్టళ్లలో ఇప్పటికే ప్రత్యేక ఆడిట్ నిర్వహించినట్లు సీపీ సుమతి పేర్కొన్నారు. "హాస్టల్ నిర్వాహకులు తప్పనిసరిగా హైరిజల్యూషన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తే వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే హాస్టళ్లను సీజ్ చేయడానికి వెనుకాడం."

**పాన్ డబ్బాలే టార్గెట్**

మత్తు పదార్థాల విక్రయాలకు కేంద్రాలుగా మారుతున్న పాన్ డబ్బాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. నిషేధిత పదార్థాలు విక్రయిస్తే కఠినమైన పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగర భద్రతలో సామాన్య పౌరులు, పెడెస్ట్రియన్లు సైతం భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

**"ఒక్క కేసు.. జీవితాంతం చీకటి"**

యువతకు హితబోధ చేస్తూ సీపీ సుమతి భావోద్వేగంగా మాట్లాడారు. "తెలంగాణ దేశంలోనే అత్యంత యువ రాష్ట్రం. 15 నుండి 30 ఏళ్ల వయసు అనేది దేశానికి పునాది వంటిది. ఈ సమయంలో కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలే తప్ప, క్షణికానందం కోసం మత్తుకు బానిస కావొద్దు. ఒక్కసారి NDPS (మత్తు పదార్థాల నిరోధక చట్టం) కేసులో చిక్కుకుంటే, మీ కెరీర్ అక్కడితో ముగిసిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాలకు శాశ్వతంగా దూరమవుతారు."

* **పాత అనుభవాల నేపథ్యంలో పక్కా ప్లాన్**

గతంలో తాను సికింద్రాబాద్ డీసీపీగా ఉన్నప్పుడు ఎదురైన సవాళ్లను ఆమె గుర్తు చేసుకున్నారు. సికింద్రాబాద్‌లోని అక్రమ లాడ్జీలు డ్రగ్స్ విక్రయాలకు ఎలా అడ్డాగా మారాయో వివరించిన ఆమె, ప్రస్తుత బాధ్యతల్లో అటువంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన గ్రౌండ్ లెవల్ నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బాధితులకు శిక్షలతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని జనజీవన స్రవంతిలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీపీ పేర్కొన్నారు.




# హైదరాబాద్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య దారుణ హత్య

- **వినయ్ రంజన్ రే భార్య సునంద దారుణ హత్య**
- **పనిమనిషి కల్పన, ఆమె గ్యాంగ్ హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తింపు**
- **అర్ధరాత్రి రెండు గంటలకు హత్య జరిగిందన్న సీపీ సజ్జనార్**

హైదరాబాద్, 08 (భారత శక్తి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య సునంద (55) దారుణ హత్యకు గురయ్యారు. బంగారం, డబ్బుల కోసం పనిమనిషి కల్పన ఆమెను హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కల్పనతో పాటు ఆమె గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడిందని భావిస్తున్నారు. రిటైర్డ్ అధికారి నివాసంలో కల్పన పనిమనిషిగా చేరింది. పక్కా ప్లాన్‌తో ఏడెనిమిది నెలల పాటు కల్పన, ఆమె గ్యాంగ్ ఎదురుచూసినట్లు తెలుస్తోంది. ఇంటి ముందు నుంచి వస్తే సీసీటీవీ ఫుటేజీకి చిక్కుతామని భావించి, వెనుక నుంచి వచ్చి ఈ హత్యకు పాల్పడ్డారు. కల్పనతో సహా మొత్తం ముగ్గురు ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. హత్య తర్వాత పారిపోయే క్రమంలో ఒక నిందితుడి క్యాప్ కిందపడటంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. సునంద భర్త వినయ్ రంజన్ రే ప్రస్తుతం బెంగళూరులో ఉన్నారు. సునంద ఒంటరిగా ఉన్న విషయాన్ని గుర్తించిన కల్పన, ఈ విషయాన్ని తన గ్యాంగుకు చేరవేసి వారిని రప్పించింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ హత్య జరిగింది. కల్పన నేపాల్‌కు చెందిన మహిళ. డబ్బులు, బంగారం చోరీ కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య జరిగినట్లు తమకు సమాచారం వచ్చిందని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. రాత్రి రెండు గంటల సమయంలో హత్య జరిగిందని తెలిపారు. నేపాలీ గ్యాంగ్ ఈ హత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని అన్నారు. కొన్ని ఆధారాలు సేకరించామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని సజ్జనార్ అన్నారు. నోట్లో గుడ్డలు కుక్కి హత్య చేశారని వెల్లడించారు. బంగారం, నగలు ఎత్తుకుపోయారా లేదా తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. వెనుక గేటు నుంచి వచ్చి హత్య చేసినట్లు చెప్పారు. కాగా, ఘటనా స్థలాన్ని డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్ పరిశీలించారు.

# సికింద్రాబాద్‌లో దారుణం.. ప్రేమ వ్యవహారంలో ఇంజినీరింగ్ విద్యార్థి హత్య

సికింద్రాబాద్, మే 8 (భారత శక్తి) : సికింద్రాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారం కారణంగా ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని అత్యంత కిరాతకంగా హత్య చేశారు. హెచ్చరించినా తమ కుమార్తెతో లవ్ అఫైర్ కొనసాగిస్తున్నాడనే కోపంతో యువతి బంధువులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ హత్య జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జవహర్‌నగర్‌కు చెందిన యువన్ (23) ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతనికి, సీతాఫల్‌మండికి చెందిన ఓ యువతికి నాలుగేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. ఈ విషయం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు గతంలో యువన్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ యువతి ఇంటికి



సమీపంలోనే తన స్నేహితుడి ఇంట్లో ఉంటూ అతను ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఈ క్రమంలో, యువన్ గురువారం రాత్రి యువతిని కలవడానికి ఆ ప్రాంతానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి మొబైల్ ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తుండగా యువతి బంధువులు అక్కడికి వచ్చి కత్తులతో దాడి చేశారు. సుమారు 17 సార్లు పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో సీతాఫల్‌మండిలో ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం యువన్ మృతదేహంతో అతని కుటుంబ సభ్యులు యువతి ఇంటి ముందు ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఈ హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణించాయని, వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. పోలీసు యంత్రాంగం బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెట్టడంపై దృష్టి సారించడం వల్లే శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని ఆయన ఆరోపించారు.

# కొడంగల్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 8 (భారత శక్తి) : వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం కొడంగల్ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని భక్తులకు కూడా ఈ ఆలయం మరింత చేరువగా ఉంటుందని అన్నారు. కొడంగల్‌లో శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా యాగంలో పాల్గొన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌలతాబాద్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గ్రూపులు పక్కనపెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దగలుగుతామని అన్నారు. ప్రతి గ్రామంలో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయని, అవన్నీ పక్కన పెట్టి అందరూ కలిసి కట్టుగా ఉండాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చాలామంది నాయకులు కలలు కన్నారని అన్నారు. కానీ వివిధ కారణాల చేత పలుమార్లు వాయిదాపడుతూ వచ్చిందని వ్యాఖ్యానించారు. నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆనాడు చదువుకోవడానికి కొడంగల్ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు అందరూ కొడంగల్ వచ్చేలా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు చురుగ్గా పనిచేయాలని అన్నారు. కృష్ణావికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతులు తెచ్చుకున్నామని అన్నారు. ఇక్కడ అపారమైన సున్నపురాయి ఉందని తెలిపారు. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చామని అన్నారు. రాబోయే ఆరేళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. పెద్ద ఇండస్ట్రియల్ పార్కును లగచర్ల దగ్గర నిర్మిస్తున్నట్టు చెప్పారు. కోస్గి నుంచి నేరుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు.

### మోదీ పర్యటన
## ఆ ప్రాంతాల్లో డ్రోన్లపై నిషేధం!

హైదరాబాద్, మే 8 (భారత శక్తి) : మే 10, ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# గవర్నర్‌తో భేటీ.. రేపే సీఎంగా విజయ్ పట్టాభిషేకం

చెన్నై:, మే 8 (భారత శక్తి) : తమిళనాడు రాజకీయాల్లో కొన్నిరోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు మార్గం సుగమమైంది. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో రేపు ఉదయం 11 గంటలకు ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సాయంత్రం విజయ్ లోక్ భవన్ కు వెళ్లి గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మద్దతు తమకుందని గవర్నర్‌కు ఆధారాలతో సహా వివరించారు. ఈ మేరకు ఆయా పార్టీల మద్దతు లేఖలను గవర్నర్ కు అందించారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించేందుకు గవర్నర్ సమ్మతి తెలిపారు. అంతకుముందు విజయ్ చేసిన విజ్ఞప్తులను, తగిన సంఖ్యాబలం లేదనే కారణంతో గవర్నర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. విజయ్‌ను అధికారానికి దూరం చేసేందుకు, దశాబ్దాల వైరం మరచి డీఎంకే, అన్నాడీఎంకే ఏకమవుతాయనే ప్రచారం జోరుగా సాగింది. అయితే, తాజా పరిణామాలతో ఆ ఊహాగానాలకు తెరపడింది. కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం మద్దతుతో విజయ్ టీవీకే పార్టీ మ్యాజిక్ ఫిగర్ ను అందుకుంది. ఈ క్రమంలో గవర్నర్ తో భేటీ ముగిసిన అనంతరం విజయ్, తమకు మద్దతు తెలిపిన సీపీఐ, సీపీఎం కార్యాలయాలకు వెళ్లి వామపక్ష నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ప్రభుత్వ ఏర్పాటు విషయంలో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడడంతో టీవీకే నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారంటూ వార్తలు వచ్చాయి. అయితే టీవీకే వర్గాలు ఆ వార్తలను ఖండించాయి. తాము సుప్రీంకోర్టుకు వెళ్లామనడంలో నిజంలేదని స్పష్టం చేశాయి.

### తెలంగాణ ఫీజు రీయింబర్స్‌మెంట్
## విద్యార్థులకు కొత్త రూల్స్!

హైదరాబాద్, మే 8 (భారతశక్తి) : తెలంగాణ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు ప్రక్రియలో కీలకమైన సంస్కరణలు చేపట్టింది. ఇకపై ట్యూషన్ ఫీజుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే విద్యార్థుల పదో తరగతి మెమోలోని పేరు, ఇంటిపేరు.. వారి ఆధార్ కార్డులోని వివరాలతో కచ్చితంగా సరిపోలాల్సి ఉంటుంది. ఈ రెండింటిలో ఏమాత్రం తేడా ఉన్నా దరఖాస్తు ప్రక్రియ ముందుకు సాగదు. జాతీయ ఉపకార వేతనాల విధానానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ కొత్త పద్ధతిని అమలులోకి తెచ్చింది. దరఖాస్తు సమయంలో విద్యార్థులు తమ పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, పుట్టినతేదీ, ఉత్తీర్ణులైన సంవత్సరం వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత ఆధార్‌లోని పేరు, పదో తరగతి మెమోలోని పేరు సరిపోలితేనే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదటి దశ పూర్తయ్యాక విద్యార్థికి ఒక ఐడీ వస్తుంది. అనంతరం మీ సేవ కేంద్రాల్లో ఆధార్ బయోమెట్రిక్ ప్రాసెస్ పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో మిగతా వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. రెన్యువల్ విద్యార్థులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. ఈ సంస్కరణలో భాగంగా ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎస్సీ విద్యార్థులకు అందిస్తున్నట్లుగానే, ఇకపై ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు కూడా ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లను నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయనుంది. ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటుండగా, ప్రభుత్వం సుమారు రూ.2400 కోట్లు ఖర్చు చేస్తోంది. అధికారిక అంచనాల ప్రకారం సుమారు 20 శాతం మంది విద్యార్థులు తమ ఆధార్ వివరాలను సవరించుకోవాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 202627 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా విద్యార్థులు తమ ఆధార్ కార్డులో పేరు, ఇంటిపేరులో ఉన్న తప్పులను ఈ వేసవి సెలవుల్లోనే సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతో పాటు తమ మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో, ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలి. అన్ని వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ప్రభుత్వం ఫీజులను మంజూరు చేస్తుంది.

### వేగంగా వ్యాపిస్తున్న హంటా వైరస్
## అప్రమత్తంగా ఉండాలన్న డబ్ల్యూ హెచ్ ఓ

జెనీవా: మే 8: ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక స్పష్టతనిచ్చింది. ముఖ్యంగా ఇది కోవిడ్19 తరహాలో మళ్లీ లాక్‌డౌన్‌లకు దారితీస్తుందా? మాస్కులు ధరించాలా? అనే సందేహాలకు నిపుణులు సమాధానమిచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఎపిడెమిక్ అండ్ పాండమిక్ మేనేజ్మెంట్ డైరెక్టర్ డాక్టర్ మరియా వాన్ కెర్ఖోవ్ స్పందిస్తూ, హంటా వైరస్ కోవిడ్ లేదా ఇన్‌ఫ్లుయెంజా వంటిది కాదని, దీని వ్యాప్తి విధానం పూర్తిగా భిన్నంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక క్రూయిజ్ షిప్‌లో కనిపిస్తున్న ఈ వైరస్ క్లస్టర్, కేవలం పరిమిత పరిధిలో, సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తుల మధ్య మాత్రమే వ్యాపిస్తోందని తెలిపారు. గతంలో 2018-19లో అర్జెంటీనాలో వచ్చిన 'ఆండీస్ వైరస్' తరహాలోనే ఇది కూడా ఒక పరిమితమైన వ్యాప్తిగానే ఉంటుందని, ఇది పెద్ద మహమ్మారిగా మారే అవకాశం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. హంటా వైరస్‌కు, కోవిడ్19కు మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం అవి వ్యాపించే విధానం. కోవిడ్19 గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి చాలా వేగంగా వ్యాపించే శ్వాసకోశ వైరస్. కానీ, హంటా వైరస్ ప్రధానంగా జూనోటిక్ వ్యాధి (జంతువుల నుంచి మనుషులకు వచ్చేది). ఇది ఎలుకల మూత్రం, మల విసర్జితాలు లేదా లాలాజలం ద్వారా మనుషులకు సోకుతుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ వ్యాప్తి చెందడం చాలా అరుదు. కేవలం 'ఆండీస్ స్ట్రెయిన్' విషయంలో మాత్రమే సన్నిహిత సంబంధాలు ఉన్నవారి మధ్య వ్యాప్తి కనిపిస్తుంది. కోవిడ్ అంత వేగంగా ఇది వ్యాపించదు కాబట్టి, పెద్ద ఎత్తున మహమ్మారిగా మారే ప్రమాదం తక్కువని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి సోకిన వారితో కాంటాక్ట్ ట్రేసింగ్, ఐసోలేషన్ వంటి ప్రజారోగ్య చర్యలు పాటించడం ద్వారా ఈ వైరస్ గొలుసును సులభంగా తెంచవచ్చని డాక్టర్ అబ్దిరహ్మాన్ మహమూద్ పేర్కొన్నారు. హంటా వైరస్ కేసుల వారీగా చూస్తే కోవిడ్ కంటే ఎక్కువ ప్రాణాంతకమైనది అయినప్పటికీ, అది సమర్థవంతంగా వ్యాపించలేదు కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. ఈ వైరస్ యొక్క ఇంక్యుబేషన్ పీరియడ్ (వైరస్ సోకిన తర్వాత లక్షణాలు బయటపడే సమయం) ఆరు వారాల వరకు ఉండవచ్చని, అందుకే మరికొన్ని కేసులు వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అథానమ్ గెబ్రియేసస్ తెలిపారు.

### పుతిన్ హత్యకు కుట్ర..
## ఎక్కువ కాలం బంకర్లోనే గడుపుతున్న రష్యా అధినేత

మాస్కో, రష్యా: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరిగినట్టు వస్తున్న వార్తలు అంతర్జాతీయ స్థాయిలో పెను సంచలనం రేపుతున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న ఈ తరుణంలో, పుతిన్ తన భద్రతను అత్యంత కట్టుదిట్టం చేసుకోవడం గమనార్హం. ఈ ప్రపంచంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన నేతలలో పుతిన్ ఒకరు. రష్యా ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ (ఎఫ్ఎస్ఓ) ఆయనను 24 గంటలూ ఒక కవచంలా కాపాడుతుంది. మాస్కో అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, కొన్ని నెలల క్రితం నోవ్‌గోరోడ్ ప్రాంతంలోని పుతిన్ ప్రైవేట్ నివాసం వద్ద పుతిన్ పై హత్యాయత్నం జరిగింది. అయితే భద్రతా కారణాల రీత్యా ఈ విషయాన్ని బయటకు వెల్లడించలేదు. హత్యాయత్నం నేపథ్యంలో, పుతిన్ భద్రతను భారీగా పెంచారు. ఈ కుట్ర నేపథ్యంలో పుతిన్ తన బహిరంగ పర్యటనలను పూర్తిగా తగ్గించుకున్నారు. యుద్ధ పర్యవేక్షణ కోసం ఆయన ఎక్కువ సమయం అత్యాధునిక సౌకర్యాలున్న భూగర్భ బంకర్లలోనే గడుపుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. పుతిన్ ఉండే ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ ఆధారిత పరికరాలపై పూర్తి నిషేధం విధించారు. ఉక్రెయిన్ డ్రోన్ల ముప్పు నుంచి తప్పించుకోవడానికి మాస్కో నది వెంబడి భారీగా భద్రతా బలగాలను మోహరించారు. రష్యా వర్గాలు ఉక్రెయిన్‌పై ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అటు అమెరికా, ఇటు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సంస్థలు ఈ వార్తలను తోసిపుచ్చాయి. పుతిన్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల కలిగే అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఇలాంటి కుట్రలకు తాము పాల్పడలేదని వారు వాదిస్తున్నారు. గతంలో కూడా పుతిన్‌పై కనీసం ఐదు నుంచి ఆరు సార్లు హత్యాయత్నాలు జరిగినట్లు చరిత్ర చెబుతోంది.

### యూఎస్-ఇరాన్ వార్
## చమురు కంపెనీలకు భారీ దెబ్బ!

అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నాయి. అయితే మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు యథాతథంగా ఉన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ముడిసరుకు ధర ఒక దశలో యాభై శాతం పెరిగింది. కానీ మన వద్ద చమురు కంపెనీలు ధరలను స్థిరంగా కొనసాగించాయి. దీంతో చమురు కంపెనీలకు రూ.30 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఒక బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్ల వద్ద ఉండగా, ప్రస్తుతం 100 డాలర్లకు పైగా పలుకుతోంది. ఒక దశలో 144 డాలర్లకు కూడా చేరుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఇంధన సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాయి. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ, దేశీయ చమురు రంగ సంస్థలు పెంచకపోవడంతో ఈ మూడు కంపెనీలు రూ.30 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయి. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్‌పై లీటర్‌కు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీంతో నష్టాలు రూ.62,500 కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు తగ్గాయి. అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు ధరకు అదనంగా మరికొన్ని ఖర్చులను భరించాల్సి వచ్చింది. రవాణా నౌకలను దారి మళ్లించడం, బీమా ప్రీమియాలు పెరగడం వంటి ఖర్చులు జత కలిశాయి.

## యూఎస్-ఇరాన్ వార్: చమురు కంపెనీలకు భారీ దెబ్బ!

జకార్తా/నార్త్ మలుకు, మే 08 : ఇండోనేషియాలో మరోసారి అగ్నిపర్వతం బద్దలైంది. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని దుకోనో అగ్నిపర్వతం శుక్రవారం ఉదయం విస్ఫోటనం చెందింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక పోలీసులు ధ్రువీకరించారు. పర్వతంపై చిక్కుకుపోయిన సుమారు 20 మంది పర్వతారోహకులను సురక్షితంగా తరలించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:40 గంటలకు ఈ విస్ఫోటనం సంభవించింది. దీని ప్రభావంతో సుమారు 10 కిలోమీటర్ల ఎత్తు వరకు దట్టమైన బూడిద మేఘాలు ఆకాశంలోకి ఎగిసిపడ్డాయి. అగ్నిపర్వత బిలం నుంచి 4 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. వర్షాలు కురిస్తే అగ్నిపర్వత బురద ప్రవాహాలు (మడ్‌ఫ్లోస్) సంభవించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ చేశారు. దుకోనో అగ్నిపర్వతం ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా విస్ఫోటనం చెందింది. ఆ సమయంలో విమానయాన రంగానికి అధికారులు ఆరెంజ్ లెవెల్ హెచ్చరిక జారీ చేశారు. బూడిద కారణంగా శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రజలు మాస్కులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సముద్ర మట్టానికి 1,087 మీటర్ల ఎత్తులో ఉన్న దుకోనో, ఇండోనేషియాలోని 127 క్రియాశీల అగ్నిపర్వతాలలో ఒకటి. గత నెలలో ఇండోనేషియాలోని మౌంట్ సెమేరు అగ్నిపర్వతం కూడా పలుమార్లు విస్ఫోటనం చెందిన విషయం తెలిసిందే.

### పుదుచ్చేరిలో...
## ఐదోసారి సీఎం అవుతున్న రంగస్వామి

పుదుచ్చేరి, మే 08: పుదుచ్చేరి సీఎం రంగస్వామి చరిత్రపుట్లోలకి ఎక్కబోతున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో, రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. మొత్తం 30 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 16 స్థానాలు అవసరం కాగా, ఎన్డీయే కూటమి 18 స్థానాలను (ఏఐఎన్ఆర్సీ 12, బీజేపీ 4, స్వతంత్రులు 2) కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్సీ 16 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే 5, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పరిమితం అయ్యాయి. పుదుచ్చేరి రాజకీయాల్లో అత్యంత సామాన్యుడిగా, మృదుభాషిగా పేరున్న రంగస్వామిని ఎమ్మెల్యేలందరూ తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో, త్వరలోనే ఆయన ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విజయం రంగస్వామి వ్యక్తిగత ఇమేజ్‌కు నిదర్శనం మాత్రమే కాకుండా, పుదుచ్చేరిలో ఎన్డీయే పట్టును మరింత బలోపేతం చేసింది.


## బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు ప్రమాణం

కోల్‌కతా, మే 8 : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది. మే 9న కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

# గుమ్మడిదలలో 26 లక్షల రూపాయల విలువైన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ

* **చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**

గుమ్మడిదల, మే 7 (భారత శక్తి) : గుమ్మదల మున్సిపాలిటీ, మండల పరిధిలోని వివిధ వార్డులు, గ్రామాల పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 26 లక్షల రూపాయల విలువైన చెక్కులను పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు పంపిణీ చేశారు. గురువారం ఉదయం గుమ్మడిదల తహసిల్దార్ కార్యాలయం అవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆడపిల్ల పెళ్లి భారం కాకూడదన్న సమన్నత లక్ష్యంతో దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఈ పథకాన్ని ప్రవేశ పట్టడం జరిగిందని తెలిపారు. పూర్తి



పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, తహసిల్దార్ పరమేశం, ఎంపీడీవో ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

* **పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
* **ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పంపిణీ**

పటాన్‌చెరు, మే 8 (భారత శక్తి) : ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం ఎస్ ఎన్ కాలనీకి చెందిన నగారిగారి మరియమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వరంబండ కౌన్సిలర్ అంతి రెడ్డి పాల్గొన్నారు

# అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

* **కొర్లకుంట చిత్తారమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్..**

జిన్నారం, మే 8 (భారత శక్తి) : అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించి నూతన దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు , సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ప్రకాశ్ చారి, నరసింహ, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# దేవాదాయ శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

* **బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అదెల్లి రవీందర్**

అమీన్‌పూర్, మే 8 (భారత శక్తి) : కోట్లాది హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరామునిపై శ్రీరామచంద్రునిపై దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి అనుచిత అవమానం చేస్తూ మాట్లాడినా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తక్షణమే రాజీనామా చేయాలనీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ హిందూ దేవతలను దేవుళ్లను కించపరుస్తూ మాట్లాడటం కాంగ్రెస్ పార్టీ మరియు ఇతర పార్టీలకు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ మైనారిటీ ఓట్ల కోసం హిందూ దేవతలను విమర్శించడం దారుణమాని తక్షణమే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పి



వాక్యాలు వెనక్కు తీసుకెపవాలని లేనిపక్షామోలో దేవాదాయ మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ కచ్చితంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ రూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు. హిందూ సమాజం హిందూ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.

# ఈ–చెత్తను వదిలించుకో.. 'రివార్డు' పట్టుకో!

* **బడంగ్‌పేట్ సర్కిల్‌లో రేపు, ఎల్లుండి 'ఈ-వేస్ట్' సేకరణ**
* **వార్డుల వారీగా 6 కలెక్షన్ సెంటర్లు**
* **వ్యర్థాలిస్తే యాప్‌లో పాయింట్లు.. కొనుగోళ్లపై డిస్కౌంట్లు**

బడంగ్‌పేట్, మే 8 (భారత శక్తి) : మీ ఇంట్లో పాత మొబైల్ ఫోన్లు ఉన్నాయా? విరిగిపోయిన చార్జర్లు, పనికిరాని కంప్యూటర్లు, బ్యాటరీలతో ఇబ్బంది పడుతున్నారా? వాటిని ఎక్కడ పడేయాలో తెలియక స్టోర్ రూమ్‌లో మూలన పెట్టారా? అయితే మీకు గుడ్ న్యూస్. ఆ చెత్తను వదిలించుకోవడమే కాకుండా, తద్వారా డిస్కౌంట్లు కూడా పొందే అవకాశాన్ని జీహెచ్ఎంసీ కల్పిస్తోంది. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలో ఈ నెల 9, 10 తేదీల్లో భారీ ఎత్తున 'ఈవ్యర్థాల సేకరణ' డ్రైవ్‌ను నిర్వహించనున్నారు.

**యాప్‌లో నమోదు..**

ఈ డ్రైవ్ ప్రత్యేకత ఏంటంటే.. మీరు ఇచ్చే ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు విలువ ఉంటుంది. సేకరించిన వ్యర్థాల వివరాలను వెంటనే 'Loop Sustainability' అనే యాప్‌లో ఇన్‌చార్జ్‌లు




నమోదు చేస్తారు. దీని ద్వారా పౌరులకు రివార్డు పాయింట్లు లభిస్తాయి. ఈ పాయింట్లను ఉపయోగించి ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎన్‌జీఓలు, నిర్దేశిత షాపుల్లో వస్తువులు కొన్నప్పుడు భారీగా డిస్కౌంట్లు పొందవచ్చు. అంటే మీ ఇంటి చెత్తే మీకు లాభాన్ని తెచ్చిపెట్టబోతోంది.

**ఎక్కడెక్కడ అంటే..?**

ప్రజలు సులభంగా ఈవేస్ట్‌ను అందజేసేందుకు సర్కిల్ పరిధిలో ఆరు కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు:

నాదర్‌గుల్ (57): గుర్రంగూడ వార్డు ఆఫీస్
ప్రశాంతి హిల్స్ (58): నంది హిల్స్ బస్ స్టాప్
జిల్లెలగూడ (59): సీనియర్ సిటిజన్ భవన్
మీర్‌పేట్ (60): మీర్‌పేట్ వార్డు ఆఫీస్
బడంగ్‌పేట్ (61): సర్కిల్ 16 ఆఫీస్
బాలాపూర్ (62): పాత ఎంఆర్ఓ ఆఫీస్

* **పర్యావరణం కోసం కలిసి రండి: డిప్యూటీ కమిషనర్**

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. ఈ వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు, గాలి కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే శాస్త్రీయంగా వీటిని రీసైక్లింగ్ చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను తీసుకొచ్చి నగరాన్ని క్లీన్‌గా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# నగరంపై 'డ్రోన్' ఆంక్షలు.. నేడు నో ఫ్లై జోన్‌గా బేగంపేట పరిసరాలు

* **ప్రధాని మోదీ రాక నేపథ్యంలో భద్రతా బలగాల పహారా..**
* **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

మల్కాజ్గిరి, మే 9 (భారత శక్తి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటన దృష్ట్యా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మల్కాజ్‌గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఈ నెల 10వ తేదీన బేగంపేట పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రధాని హాజరుకానున్న నేపథ్యంలో.. సభా ప్రాంగణం చుట్టుపక్కల ప్రాంతాలను 'నో ఫ్లై జోన్'గా ప్రకటిస్తూ డీసీపీ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు.

**24 గంటల పాటు ఆంక్షలు**

* ప్రధాని పర్యటనను పురస్కరించుకుని భద్రతా కారణాల దృష్ట్యా సెక్షన్ 163 (BNSS) కింద నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి.
* సమయం: ఆదివారం అర్ధరాత్రి 00:00 గంటల నుండి రాత్రి 24:00 గంటల వరకు (24 గంటల పాటు).
* వ్యాప్తి: బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు వర్తిస్తాయి.

**నిషేధిత పరికరాల జాబితా**




గాలిలో ఎగిరే ఎలాంటి పరికరానికైనా అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యంగా:

*** అన్ని రకాల రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు..**

> పారాగ్లైడర్లు, పారా మోటార్లు.
> రిమోట్ కంట్రోల్డ్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు.

* **నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

"ప్రధాని పర్యటన నేపథ్యంలో గాలిలో డ్రోన్లు ఎగురవేయడం చట్టరీత్యా నేరం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ప్రజలు, డ్రోన్ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి."

**మల్కాజ్‌గిరి డీసీపీ**

సభ జరిగే ప్రాంతంలో ఇప్పటికే బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేశాయి. ప్రతి ఒక్కరికీ విడివిడిగా నోటీసులు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, పత్రికా ప్రకటన ద్వారానే ఈ సమాచారాన్ని బహిరంగ పరుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# బీసీ ప్రభంజనం సభకు ముఖ్యఅతిథిగా ఎంపీ ఆర్ కృష్ణయ్య

* **బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్ప సత్యనారాయణ వెల్లడి**

ఎల్బీనగర్, మే 08 (భారత శక్తి): మే 24 ఆదివారం ఎల్బీనగర్ లో జరగనున్న బీసీ ప్రభంజనం సభకు ముఖ్యఅతిథిగా రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరవుతారని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సత్యనారాయణ ఆర్. కృష్ణయ్యను శుక్రవారం ఆయన నివాసంలో కలిసి బీసీ ప్రభంజనం సభకు రావాలని ఆహ్వానించారు. బీసీ ఉద్యమానికి మద్దతుగా జరుగుతున్న బీసీ ప్రభంజనం సభకు ఖచ్చితంగా హాజరవుతానని ఆర్. కృష్ణయ్య హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రధానంగా వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు



దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని బీసీ ప్రభంజనం నిర్వహించడం జరుగుతుందని సత్యనారాయణ వివరించారు. గతంలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలు అందించిన ఆర్. కృష్ణయ్య ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు హాజరు కావడం బీసీ ఉద్యమానికి స్ఫూర్తినిస్తుందని సత్యనారాయణ వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగే బీసీ ప్రభంజనం సభకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నేతలు హాజరు కానున్నారని ఆయన అన్నారు. మే 24న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభ బీసీ ఉద్యమంలో చారిత్రాత్మకంగా నిలిచి పోతుందని బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజే రాష్ట్ర నాయకులు జాల కిషన్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొంటారని కిషన్ ఈ సందర్భంగా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలని ఎస్సీ ఎస్టీ, బీసీ జేఏసీ కన్వీనర్ తెలంగాణ వెంకన్న విజ్ఞప్తి చేశారు. మే 24న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ సంపూర్ణంగా మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. రాజ్యాధికారానికి దూరంగా ఉన్న దళితులు, గిరిజనులు, బీసీలు ఏకం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# తిరుమలలో భక్తులకు విస్తృత వసతి సౌకర్యాలు: తితిదే

తిరుమల, 08 (భారత శక్తి): శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది భక్తులకు విస్తృత వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తితిదే తెలిపింది. వసతి, విశ్రాంతి, లాకర్, స్నానం, అన్నప్రసాదం తదితర సదుపాయాలను కల్పిస్తున్నట్లు వివరించింది. భక్తుల ఆచారాలను దృష్టిలో ఉంచుకుని తిరుమల, తిరుపతిలో అనేక వసతి గదులు, యాత్రికుల సముదాయాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. తిరుమలలో వసతి గదులు పొందాలనుకునే భక్తులు సీఆర్వో జనరల్ కౌంటర్‌లో ఆధార్, ఫోన్ నంబరు తదితర వివరాలు నమోదు చేసుకోవాలని తితిదే సూచించింది. అనంతరం కేటాయించిన గది నంబరు, ఆ ప్రాంత వివరాలు ఎస్ఎంఎస్ ద్వారా భక్తులకు సమాచారం పంపిస్తారని తెలిపింది. భక్తులు సంబంధిత ఉప విచారణ కార్యాలయంలో యూపీఐ/కార్డు ద్వారా చెల్లింపు చేసి గదిని పొందవచ్చని పేర్కొంది. తిరుమలలో స్థలాభావం కారణంగా 7800 వసతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని.. కుటుంబాలతో వచ్చిన భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. ఒంటరి, అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదుల కేటాయించబోమని వివరించింది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.